J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 25 21.11.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## టీటీడీలో కల్తీ నెయ్యి

# నిర్ణయం బోర్డుదైతే.. అధికారులెందుకున్నట్లు?



» మాజీ ఈవో ధర్మారెడ్డి వితండవాదం

» ధర్మారెడ్డి హయాంలో వర్ధిల్లిన అధర్మం

ఏ విషయంలోనైనా పాలనాపరంగా నాయకులు శాసనాలు చేస్తే.. అధికారులు వాటిని అమలు చేస్తారు. అయితే నాయకులు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు వాటిని సరిచేయాల్సిన బాధ్యత, నిబంధనలను తెలియజెప్పాల్సిన కర్తవ్యం మాత్రం ఉన్నతాధికారులదే. ఎందుకంటే అంతిమంగా సంతకాలు, రాతకోతలకు సంబంధించి బాధ్యత వహించాల్సింది అధికారులే కనుక. ఈ విషయాన్ని కొందరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కీలక సమయాల్లో పట్టించుకోకపోవడం, తీరా చట్టం ముందు దోషిగా నిలబడాల్సి వచ్చినప్పుడు మేం మాత్రమే బాధ్యులం కాదు, సమిష్టి నిర్ణయాలు అంటూ తప్పించుకోవడం కొందరికి పరిపాటిగా మారింది. ఈ కోవలోకే వస్తారు తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి (అ)ధర్మారెడ్డి.

ఇటీవల శ్రీవారి లడ్డూలో కల్తీనెయ్యి వ్యవహారంలో, తిరుమలలో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఏర్పాటైన సిట్ (స్వతంత్ర దర్యాప్తు సంస్థ) దర్యాప్తులో భాగంగా ధర్మారెడ్డి తన నక్కజిత్తులను ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. ఎందుకంటే తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా ఉంటూ తన హయాంలో చోటు చేసుకున్న కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి తనకు బాధ్యత లేదని, తన తప్పు ఉంటే... అది అప్పటి ఛైర్మన్,

2లో



## • పవన్ కళ్యాణ్

# మారిన వేషం.. మారుతున్న రాజకీయం

- సీఐఐ పెట్టుబడుల సదస్సుపై మౌనం
- కీలక ప్రభుత్వ సమావేశాలకి డుమ్మా
- బిహార్‌కి సైతం మొహం చాటేసిన పవన్

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తాను రాజకీయాలలోకి వచ్చినప్పటినుండి మొన్న మొన్నటిదాకా ఎప్పుడు ప్రజాక్షేత్రంలోకి వచ్చినా ఒక ప్రత్యేకమైన ఆహార్యంతో కనిపించేవారు. తెల్లని లాల్చీ, పైజామాతో రాజకీయ నాయకుడు అంటే ఇలాగే ఉండాలేమో అన్నట్లుగా దర్శనమిచ్చేవారు. అయితే, అకస్మాత్తుగా ఆయన గత కొన్నాళ్లుగా తన గెటప్ మార్చారు. పొట్టిగా జుట్టు కత్తిరించుకుని సాదా సీదా వస్త్రధారణ చేయడంతోపాటు, అప్పుడప్పుడు సినిమా స్టైల్ వేషధారణలో కూడా కనిపిస్తున్నాడు. ఉదాహరణకి తాజాగా తిరుపతి పరిసర ప్రాంతాలలో పర్యటించే క్రమంలో ఆయన బ్యాగీ ఫ్యాంటు, టీషర్టు వేసుకుని మూవీ స్టార్ తరహాలోనే రెడీ అయ్యారు. ఆయన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అనే భావన ఎక్కడా కలగలేదు. ఇక ఆయన వేషంతో పాటు వ్యవహారశైలిలో కూడా చాలా మార్పు వచ్చిందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. నిశితంగా గమనిస్తే.. ఇటీవల చోటు చేసుకుంటున్న కొన్ని పరిణామాలు విశ్లేషకుల అభిప్రాయానికి బలాన్ని చేకూరుస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖ పారిశ్రామిక పెట్టుబడుల సదస్సు(సీఐఐ)ని నిర్వహించింది. ఈ సదస్సుకి అంతర్జాతీయ ఆకర్షణ రావాలనే ధ్యేయంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి తన సర్వశక్తులు వొడ్డింది. అయితే కూటమిలో కీలకంగా వున్న ఉప ముఖ్యమంత్రి జనసేనాని పవన్ కళ్యాణ్ ఈ పెట్టుబడుల సదస్సుకి హాజరు కాలేదు. అంతేకాకుండా ముఖ్యమైన అంశాలపైన, నిరంతరం ట్విట్టర్ లేదా ఎక్స్ ద్వారా తన అభిప్రాయాలను పంచుకునే పవర్‌స్టార్ సీఐఐ పెట్టుబడుల సదస్సుపై మాత్రం కనీసం ఒక ట్వీట్

2లో


## తృతీయ వర్ధంతి




అమ్మా...

నిష్కల్మషమైన ప్రేమను పంచిన
స్వచ్ఛమైన మనసు మీది..
అడిగినవారికి లేదనకుండా
సాయంచేసిన సహృదయం మీది.
మా జీవితాలలో వెలుగులు నింపిన
అనురాగమూర్తి మీరు..
మాలో సేవాస్ఫూర్తిని వెలిగించిన
ఆత్మీయదీప్తి మీరు.

### శ్రీమతి బోగొల్లు పిచ్చమ్మ గారు

పరమపదించి తేది. 24.11.2025 నాటికి మూడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ... వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

**బోగొల్లు మోహన్‌రెడ్డి - నిర్మలమోహన్**
MOHAN ARCHITECTS Pvt. Ltd., MOHAN ASSOCIATES BUILDERS, Hyderabad.

**డాక్టర్ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి - డాక్టర్ సరోజిని**
నెల్లూరు

మరియు కుటుంబసభ్యులు


## భాజపాతో బీహార్..

# కమలనాథులలో హుషార్!

- మోడీ బృందం తిరుగులేని విజయం 12లో
- దక్షిణాదిన పాగాయే తదుపరి ఆశయం

# మారిన వేషం.. మారుతున్న రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

కూడా చేయలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సదస్సు ఊహించిన దానికంటే.. ఎక్కువ స్థాయిలో ఫలితాన్ని సాధించింది. అధికస్థాయిలో పెట్టుబడులకి ఒప్పందాలు జరిగాయి. 13.25 లక్షల పెట్టుబడులు వచ్చాయని, 13 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని మొత్తం మీద ఈ సదస్సు 'నభూతో నభవిష్యత్' అంటూ అటు అధికారులు, ఇటు టీడీపీ శ్రేణులు సంబరపడుతున్నారు. ఇంతటి విజయవంతంగా ఈ సదస్సుని నిర్వహించిన ప్రభుత్వాన్ని కానీ, ఈ సదస్సు కోసం తపించి శ్రమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుని కానీ, యువ మంత్రి లోకేష్‌ని కానీ పవన్ అభినందించలేదు. మొత్తం ఈ కార్యక్రమ ఘనతంతా పెదబాబు, చినబాబు తమ ఖాతాలో వేసుకున్నా పవన్ మాత్రం మౌనవ్రతం పాటించారు. వాగ్దానాలన్నీ వాస్తవ రూపం దాల్చేదాకా వేచి చూద్దామనుకున్నారా లేక ఆ క్రెడిట్ ఏదో తండ్రీ కొడుకులకే దక్కనిద్దాం అని అనుకున్నారా..? అన్న సందేహాలు రాజకీయ వర్గాల నుండి వినపడుతున్నాయి.

## సమావేశాలకి దూరంగా!

ఇటీవల జరిగిన కొన్ని కీలకమైన ప్రభుత్వ సమావేశాలకి కూడా పవన్ కళ్యాణ్ గైరుహాజరయ్యారు. ముఖ్యమంత్రి తన లండన్ పర్యటన ముగించుకుని రాగానే డేటాడ్రివెన్ పై నవంబర్ 7న సచివాలయంలో కీలక సమావేశం పెట్టారు. ఈ సమావేశంలో క్యాబినెట్ మంత్రులు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు. కానీ, ఉపముఖ్యమంత్రి హోదాలో వున్న పవన్ కళ్యాణ్ మాత్రం ఆ రోజు మంగళగిరిలోనే ఉండి కూడా సమావేశానికి గైరు హాజరయ్యారు.

చంద్రబాబు అధ్యక్షతన జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) సమావేశంలో కూడా పవన్ పాల్గొనలేదు. ఈ బోర్డులో ఉపముఖ్యమంత్రి సభ్యుడు కూడా. సదరు సమావేశం రోజు అందుబాటులో ఉండి సైతం పవన్ హాజరుకాలేదు. లక్ష కోట్ల పెట్టుబడులకు ఆ సమావేశంలో బోర్డు ఆమోదం తెలిపింది. అలాంటి కీలక సమావేశానికి కూడా పవన్ రాకపోవడం అటు అధికారవర్గాలలోనూ ఇటు రాజకీయ శ్రేణులలోనూ చర్చనీయాంశంగా మారిందన్నది రాజధాని వర్గాల సమాచారం.

మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో రాణించిన శ్రీచరణిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రానికి ఆహ్వానించి ముఖ్యమంత్రి చంద్రబాబుని, యువ మంత్రి లోకేష్‌ని కలిపించింది. అయితే, సమీపంలోనే ఉన్న పవన్ కళ్యాణ్ దగ్గరకు మాత్రం ఆమెని క్రికెట్ అసోసియేషన్ బృందం తీసుకెళ్లలేదు.

ఇక తాజాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టపర్తి పర్యటనలో ప్రధాన వేదికపై పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత తగ్గినట్లుగా స్పష్టంగా అర్థమవుతుంది. గత మాసం ప్రధానమంత్రి కర్నూలు పర్యటన సందర్భంగా వేదికపై పవన్‌కళ్యాణ్‌కి ఇచ్చినంత ప్రాముఖ్యత, ఈసారి ఇవ్వలేదని నెటిజన్‌లు కోడై కూస్తున్నారు.

ఎన్డీఏ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లకపోగా, గురువారం నాడు జరిగిన నితీష్ ప్రమాణస్వీకారానికి కూడా పవన్ ముఖం చాటేశారు. ఎన్డీఏకి తెలుగు దేశానికి మధ్య సయోధ్య కుదిర్చి 2024 ఎన్నికల్లో వాళ్ళిద్దరూ కలిసి పోటీ చేసేలా చక్రం తిప్పింది తానే అని చెప్పుకునే పవన్, ఇప్పుడు బిహార్ విషయంలో మొహం చాటేయడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ వరుస సంఘటనలన్నీ క్రోడీకరించి చూస్తే.. ఎక్కడో ఏదో తేడా జరుగుతున్నట్లు రాజకీయవర్గాలలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. అయితే, తమ నాయకుడు అన్ని విషయాలలో వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారని.. ఈ పరిణామాలతో ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని జనసైనికులు అంటున్నారు. ఎవరైనా అతిగా ఊహించుకుని కూటమిలో కుంపటి రగిలిందని ఆశపడితే ఆ ఆశలన్నీ అడియాశలవుతాయని ఢంకాపథంగా చెప్తున్నారు. రెండవ విడత మంత్రివర్గ విస్తరణ జరిగిన అనంతరం ఇలాంటి అనుమానాలన్నిటికీ సమాధానం లభిస్తుందని అప్పటివరకూ ఓపికతో వేచి వుండమని అంటున్నారు. అబ్బా... మతలబంతా మంత్రివర్గ విస్తరణ, నాగబాబుకి మంత్రి పదవిపై ఆధారపడి ఉందా..! అని విశ్లేషకులు ఆశ్చర్యపోతున్నారు!

# నిర్ణయం బోర్డుదైతే.. అధికారులెందుకున్నట్లు?

(మొదటిపేజీ తరువాయి)

నెయ్యి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యులందరికీ చెందుతుందంటూ విచారణలో చెప్పడం అత్యంత హేయం. నిజానికి పాలక మండలి, ప్రత్యేక కమిటీ ఏదైనా తప్పుడు నిర్ణయం తీసుకుంటే దాన్ని వారికి తెలియజేసి, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి ఫలానా నిబంధన ప్రకారం వీలుకాదని చెప్పే అధికారం ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో ఈవోకి ఖచ్చితంగా ఉంటుంది. అయితే, ఆ బాధ్యతను సక్రమంగా నిర్వహించకుండా కల్తీ నెయ్యి విషయంపై తన తప్పులేదని, నాటి పాలక మండలిపై నెపం నెట్టేసేలా మాట్లాడడం ధర్మారెడ్డి జిత్తులమారి తత్వానికి నిదర్శనంగా కనిపిస్తుంది. నిజానికి బోర్డు తీసుకునే నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడంతో పాటు టీటీడీ ఆదాయ వ్యయాలకు, కీలక నిర్ణయాలకు ఈవో బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో దస్త్రాలపై సంతకాలు చేసేటప్పుడు ఆమ్యామ్యాల కోసమో, ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసమో పాకులాడి నిబంధనలకు తూట్లు పొడవటం తీరా, తప్పు బట్టబయలయ్యాక ఎదుటివారిపైకి నిందను నెట్టేయడం ధర్మారెడ్డిలోని అధర్మారెడ్డికి ప్రతిబింబమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## పరకామణి కేసులోనూ..

శ్రీవారి పరకామణిలో చోరీ కేసులోనూ నాటి ఈవో ధర్మారెడ్డిపై పలు ఆరోపణలున్నాయి. గతంలో చిత్తూరు ఆర్డీఓగా పనిచేసి తర్వాత టీటీడీలో డిప్యూటేషన్‌పై ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహించిన మల్లికార్జునరావు తాజాగా సీఐడీ ఎదుట తన వాంగ్మూలాన్ని వినిపించారు. పరకామణిలో చోరీ కేసు, లోక్‌అదాలత్‌లో ఇతర కేసుల మాఫీ వంటి విషయాలన్నీ ధర్మారెడ్డికి పూర్తిగా తెలిసే జరిగాయని చెప్పినట్లు సమాచారం. అయితే, ధర్మారెడ్డి మాత్రం అన్నీ తనకు తెలిసినా, సిట్ ఎదుట 'తెలియదు, గుర్తులేదు, మరిచిపోయా' అంటూ అదుర్స్ సినిమా డైలాగ్స్ వినిపించినట్లు వినికిడి.

ఇక కల్తీ నెయ్యి కేసులో అయితే తాను అదనపు ఈవోగా, నెయ్యి సేకరణ కమిటీ సభ్యుడిగా ఉన్న కాలంలో టెండర్ నిబంధనలను మార్చడం, షరతుల ఉల్లంఘన వంటి అంశాలన్నీ అందరి సమ్మతితో జరిగాయని బుకాయించడం ఆయన డబుల్‌గేమ్‌కు పరాకాష్ట అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక తానేదైనా తప్పుచేసి ఉంటే వాటికి మిగిలిన వారు కూడా బాధ్యులే అంటూ ముక్తాయించడం ఆయన (కన్నింగ్ నేచర్) లోపభూయిష్ట మనస్తత్వానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఎందుకంటే సాధారణంగా టీటీడీ ఈవో అంటే సీనియర్ ఐఏఎస్‌లనే నియమిస్తుంటారు. కానీ అర్హత లేకపోయినా టీటీడీ ఈవో పోస్టును అప్పటి ప్రభుత్వ పెద్దల అండతో చేజిక్కించుకోవడం, తన హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ టీటీడీని తన సొంత జాగీరులా వాడుకోవడం, ఇది తప్పని చెప్పిన సహచర అధికారులను, సిబ్బందిని వేధించడం చివరికి ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరించి టీటీడీ ప్రతిష్టను మంటగలడం వంటి వికృత చర్యలకు ధర్మారెడ్డి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి సమయంలో కల్తీనెయ్యి వ్యవహారంలో తనకు బాధ్యత లేదంటూ పాలకమండలిపైన నిందలేసి ఆ నేరాన్ని నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అంటగట్టాలని చూడడం మాత్రం ధర్మారెడ్డి అధర్మ ప్రవృత్తికి నిదర్శనమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

## వై.వి.సుబ్బారెడ్డి విచారణ

ఈ కేసులో టీటీడీ మాజీ ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డిని గురువారం ఉదయం నుండి రాత్రి వరకు కూడా సిట్ అధికారులు హైదరాబాదులోని ఆయన నివాసంలో విచారిస్తుండడం గమనార్హం.

గల్పిక

# జగన్‌కి ప్రతిపక్ష హోదా.. తాడేపల్లి ప్యాలెస్‌లో సంబరాలు!

సమయం ఉదయం 8 గంటలు. తాడేపల్లి ప్యాలెస్ అంతా హడావుడిగా ఉంది. ఎవరి ముఖంలో చూసినా పండుగ వాతావరణం కనిపిస్తుంది. ప్యాలస్ మహారాణి భారతమ్మ దాదాపు రెండు గంటలుగా యేసు ప్రభువు పటం ముందు కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలో లీనమైవుంది. ప్యాలెస్ సిబ్బంది మొత్తం ఎవరి పనులలో వారు హడావుడిగా వున్నారు. ఈరోజు నుండి తమ ప్యాలెస్‌కి పూర్వకళ రాబోతోందని సంబరపడుతున్నారు.

ప్యాలెస్ ప్రహరీ బయట వున్న భద్రతా సిబ్బందికి మాత్రం ఏమీ అర్థం కావడంలేదు. అసలేం జరిగింది, ఏం జరుగుతోంది...? ఎందుకీ హడావుడి...? మా సారు పైనున్న కేసులేమైనా కొట్టేశారా...? చంద్రబాబు రాజీనామా చేశారా...? కూటమిలో చీలికలు వచ్చాయా..? తమ సారుకి మోడీసారు నుండి పిలుపొచ్చిందా...? ఇలా అనేక అనుమానాలతో భద్రతా సిబ్బందంతా ఉత్కంఠతతో ఉన్నారు.

అప్పుడే ప్యాలెస్ మెయిన్ గేటువద్దకి వచ్చిన కే.ఎన్.ఆర్ హడావుడిగా లోపలికి వెళ్తున్నాడు. ఆయనకి అడ్డంగా నిలబడిన ఓ భద్రతాధికారి అడిగాడు

"ఏమయ్యింది అన్నా.. ఈ సందడంతా ఏంటి..?"

వెంటనే స్పందించిన కే.ఎన్.ఆర్...

"మీకు ఇంకా తెలీదా... మన బాస్‌కి ప్రతిపక్ష హోదా వచ్చింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడికి రాత్రి కలలో దేవుడు కనిపించి "జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వు.. లేకుంటే నీ పదవి కూడా ఊడగొడతా" అని చెప్పాడంట. ఆయన ఉదయాన్నే మన బాసుకి కాల్ చేసి క్షమాపణ కోరి ప్రతిపక్ష హోదా ఇస్తున్నట్లుగా చెప్పి, అసెంబ్లీకి రావాలని ఆహ్వానించాడంట"

అని చెప్పి ప్యాలెస్‌లోకి పరుగులు తీశాడు.

రోజూ నాలుగున్నరకే లేసి వంద బస్కీలు తీసే జగన్‌మోహన్‌రెడ్డి.. ఈరోజు రెట్టింపు ఉత్సాహంతో వున్నాడు. రాత్రి యెహోవా కలలోకి వచ్చాక అయ్యన్నపాత్రుడికి పాపం నిద్ర పట్టినట్లులేదు, ఉదయం నాలుగు గంటలకే ఫోన్‌చేసి నన్ను నిద్రలేపి మరీ శుభవార్త చెప్పాడు అని మనసులో అనుకుంటూ, తనలో తానే నవ్వుకుంటూ, వంద బస్కీలకి బదులుగా ఈరోజు నూటయాభై బస్కీలు తీసేశాడు. యోగా, మెడిటేషన్‌తో పాటు స్నానపానాలు ముగించుకుని 8.30కి హాలులోకి వచ్చాడు. భారతి ఇంకా ప్రార్థన చేస్తూనే వుంది. సిబ్బంది ముఖంలో ఆనందం తాండవిస్తోంది. అప్పుడే పరిగెత్తుకుంటూ హాల్లోకి వచ్చాడు కే.ఎన్.ఆర్.

"గుడ్ మార్నింగ్ సార్... కంగ్రాట్యులేషన్స్" అన్నాడు.

"వాట్ కే.ఎన్.ఆర్. అప్పుడే వార్త నీదాకా వచ్చేసిందా..?" అడిగాడు జగన్ ఆనందంగా నవ్వుతూ.

"ఉదయాన్నే మేడం గారు కాల్ చేసి చెప్పారు సార్".. బదులిచ్చాడు కే.ఎన్.ఆర్.

"మనవాళ్లందరికీ చెప్పావా" అడిగాడు జగన్.

"సుబ్బారెడ్డి సారుకి చెప్పాను సార్, ఆయన తిరుమల నెయ్యి కేసులో విచారణలో వున్నారు. మిమ్మల్ని తరువాత కలుస్తానని చెప్పమన్నారు.

మిథున్‌రెడ్డి సారుకి చెప్పా.. ఆయన విదేశాలలో వున్నారు. పెద్దిరెడ్డి సారు అటవీ భూముల ఆక్రమణ వ్యవహారంలో తలమునకలై ఉన్నారట.



ఇక చెవిరెడ్డి సారు జైల్లో వున్నారు.

ధనుంజయరెడ్డి సారుకి, కృష్ణమోహన్‌రెడ్డి సారుకి చెప్పా, వాళ్ళిద్దరికీ 'డిఫాల్ట్ బెయిల్' రద్దయ్యిందంట సార్. మళ్ళీ వచ్చి లొంగిపొమ్మన్నారంట.. ఇద్దరూ ఆ గొడవలో ఉన్నారు."

"సాయిరెడ్డికి చెప్పలేదా.." అని నాలుక్కరుచుకున్నాడు జగన్‌మోహన్‌రెడ్డి.

ఆ మాట విని ఖంగుతిన్న కే.ఎన్.ఆర్. షాక్ నుండి తేరుకుని "మనకి మిగిలిన ఎం.ఎల్.ఏలు అందరికీ చెప్పాను సార్".

"అవునా ... ఏమంటున్నారు" అడిగాడు జగన్.

"అందరూ ఎగిరి గంతేశారు సార్. పద్దెనిమిది నెలల తరువాత అసెంబ్లీకి వెళ్ళి నిద్రపోయే అవకాశం వచ్చిందని పొంగిపోతున్నారు. అందరూ కట్టగట్టుకుని కొత్త బట్టలు కొనుక్కోవడానికి విజయవాడ ఎం.జి.రోడ్డుకి వెళ్తున్నారట." చెప్పాడు.

"అయితే... నువ్వు తప్ప ఎవరూ రాలేదా...?" అడిగాడు జగన్.

"ఎందుకు లేదుసార్, సజ్జల రామకృష్ణారెడ్డి సారు నాకంటే ముందే వచ్చి వరండాలో కూర్చుని వున్నారు, పిలవమంటారా" అని అడిగాడు కే.ఎన్.ఆర్.

"వద్దులే, ఇప్పుడాయనెందుకు" అంటూ అదోలాపనగా కళ్ళు మూసుకున్నాడు జగన్.

అంతలో ప్రార్ధన ముగించుకుని వచ్చింది భారతి.

సోఫాలో నిద్ర ముద్రలో వున్న జగన్‌మోహన్‌రెడ్డిని చూసి బుజంపై తట్టింది. ఆయన పలకలేదు. కొంచెం గట్టిగా తట్టింది... అయినా ఆయన పలకలేదు, ఏమైందబ్బా అనుకుంటూ ఈసారి బాగా చురుకు తగిలేలా తట్టింది.

అంతే ఒక్క ఉదుటున కళ్ళు తెరిచాడు జగన్.

"ఏమబ్బా జగన్.. రోజూ నాలుగన్నరకే నిద్ర లేచేవాడివి.. ఇవ్వాళ ఆరైనా నిద్ర పోతాండావే!.. లే.. లేచి పళ్ళు తోముకో బ్లాక్ కాఫీ పంపిస్తా" అంటూ వంటింటి వైపు నడిచింది భారతి.

"మనం ఎక్కడున్నాం..?" అరిచాడు జగన్.

"బెంగళూరు ప్యాలెస్‌లో" అంటూ సమాధానం చెప్తూ వెళ్ళిపోయింది భారతి.

"ఓ ప్రభువా ఇదంతా కలా..." అనుకుంటూ భుజాన టవల్ వేసుకుని బాత్రూంలోకి వెళ్ళాడు జగన్.

- చిన్నబ్బయ్య

## శ్రీసిటీ..

# పరిశ్రమలపై గురి.. పండిస్తున్నసిరి



- విశాఖ సదస్సులో.. శ్రీసిటీకి విశేష ప్రశంసలు
- ఎం.డీ సన్నారెడ్డి కృషికి ముఖ్యమంత్రి అభినందనలు
- 5 పరిశ్రమలకు వర్చువల్‌గా సీఎం ప్రారంభోత్సవం
- మరో 12 కొత్త కంపెనీలకు ఒప్పందాలు

*శ్రీసిటీ అంటే ప్రగతికి ప్రతీక. శ్రీసిటీ అంటే దేశ పారిశ్రామికరంగంలో సగర్వంగా ఎగిరే పతాక! వేల కోట్ల పెట్టుబడులు, 31 దేశాలకి చెందిన దాదాపు 240 పరిశ్రమలతో ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక నగరంగా ఇప్పుడు శ్రీసిటీ పేరు దశదిశలా మార్మోగుతోంది. ఇప్పటికే సుమారు 65వేల మందికి పైగానే ఉద్యోగం కల్పిస్తూ, శ్రీసిటీ ఒక పెద్ద ఉపాధి నగరంగా తన ప్రస్థానం సాగిస్తోంది. అందులో 50 శాతం ఉద్యోగాలు మహిళలకే ఇస్తుండడం మరో విశేషం. కష్టపడి పనిచేసే తత్వం, పదిమందికీ పని కల్పించే లక్ష్యంతో శ్రీసిటీ ముందడుగు వేస్తోంది. అదే శ్రీసిటీకి ఎనలేని ఖ్యాతిని తెస్తోంది.*

*శ్రీసిటీ అంటే.. ఒకప్పుడు ఓ చిన్ని పారిశ్రామిక మొలక.. ఇప్పుడది మహా వృక్షంగా విస్తరించిన క్షేత్రం. ఒకప్పట్లో అది వెనకబడిన ప్రాంతం.. ఇప్పుడది ప్రపంచప్రఖ్యాతి చెందిన పారిశ్రామిక నగరం.. అదే.. శ్రీసిటీ! ప్రపంచస్థాయిలో పరిశ్రమలకి పెద్దఎత్తున లాభాల పంట పండించే.. 'సిరి సిటీ'!.. అదే శ్రీసిటీ!...*

*నవంబరు 15న విశాఖలో జరిగిన అత్యున్నతస్థాయి పారిశ్రామికవేత్తల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నుంచి శ్రీసిటీ ప్రగతి అభినందనలందుకుంది. ఆ మహాపారిశ్రామిక నగరానికి బీజం వేసిన మహోన్నత వ్యక్తి.. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ముఖ్యమంత్రి నుంచి ప్రశంసలు లభించాయి.*

విశాఖ భాగస్వామ్య సదస్సు-2025లో రెండో రోజు శ్రీసిటీ భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా 5 కొత్త పరిశ్రమలను ప్రారంభించారు. 12 కొత్త కంపెనీలకు అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. డైకిన్, ప్రోటీరియల్ (మెట్‌గ్లాస్) మరియు శ్రీసిటీ ఫేజ-2 విస్తరణకు సంబంధించిన ప్రభుత్వ జీవోలను సంబంధిత సంస్థల సీనియర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. దీంతో, మొత్తంగా రూ.31,450 కోట్ల పెట్టుబడులు, ప్రత్యక్షంగా - పరోక్షంగా 1.1 లక్షలకు పైగా ఉద్యోగాల సృష్టికి.. శ్రీసిటీకి అవకాశాలు లభించాయి.

### అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రం.. శ్రీసిటీ :

ఈ సదస్సులో శ్రీసిటీని 'ఉత్తమ పారిశ్రామిక నమూనా'' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివర్ణించడం విశేషం. అంతేకాదు, శ్రీసిటీ.. భారతదేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రాలలో ఒకటి అంటూ ప్రశంసించారు. "ఒక విజయవంతమైన పారిశ్రామిక కేంద్రం గురించి తెలుసుకోవడానికి శ్రీసిటీ ఉత్తమ ఉదాహరణ అని, రెండు దశాబ్దాల కంటే తక్కువ సమయంలో, ఈ అద్భుతమైన పారిశ్రామిక, పర్యావరణ వ్యవస్థ రూపుదిద్దుకుందంటూ కొనియాడారు. క్యాడ్‌బరీ, కెల్లాగ్స్, ఎల్‌జీ వంటి గ్లోబల్ భారీ సంస్థలు ఇప్పటికే శ్రీసిటీలో పనిచేస్తున్నాయని అభినందించారు. శ్రీసిటీ పురోగతిని ప్రశంసిస్తూ, డాక్టర్ సన్నారెడ్డి అంకితభావంతో కూడిన నాయకత్వాన్ని అభినందించారు.

### శ్రీసిటీ మరెంతగానో ఎదగాలి

శ్రీసిటీ తన ప్రపంచ పాదముద్రను మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం శ్రీసిటీలోని 31 దేశాల కంపెనీల సంఖ్య 50 దేశాలు, 500 కంపెనీలు, 1.5 లక్షల ఉద్యోగాల లక్ష్యం దిశగా కృషి చేయాలని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి చెప్పారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం అదనంగా 2,500 ఎకరాలను మంజూరు చేసిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రపంచ కనెక్టివిటీని మెరుగుపరచడానికి త్వరలో శ్రీసిటీ సమీపంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మిస్తామన్నారు. అనంతరం, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రగతి సంబరాలలో సిఎం పాల్గొన్న ఏడాది వ్యవధిలోనే మళ్ళీ ఇన్ని ప్రారంభాలు, ఒప్పందాలు చోటు చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సమర్థ నాయకత్వం, యువ మంత్రులు లోకేష్, భరత్‌ల ప్రోత్సాహం, ఇతర అధికారుల సహకారం వల్లనే ఇదంతా సాధ్యమైందని అన్నారు. రాబోయే రెండేళ్లలో శ్రీసిటీని 50 దేశాల పరిశ్రమలకు నిలయంగా మార్చాలనే ముఖ్యమంత్రి లక్ష్యాన్ని సాధిస్తామని హామీ ఇచ్చారు.

మొత్తంగా ఈ కార్యక్రమం పారిశ్రామిక రంగంలో ఒక ప్రధాన మైలురాయిగా శ్రీసిటీ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ తయారీ శక్తి కేంద్రంగా మార్చడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది కూడా.



## గురుదేవోభవ!

నవంబర్ 17వ తేదీ తన జన్మదినం సందర్భంగా హైదరాబాదులోని తమ నివాసంలో జరిగిన 'మాతృ వందనం' కార్యక్రమంలో తన గురువు, ప్రఖ్యాత ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుని సత్కరిస్తున్న శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డాక్టర్ కే.ఐ.వరప్రసాద్‌రెడ్డి.

# రైతన్నల సంక్షేమం..ప్రభుత్వ ధ్యేయం!

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. బుధవారం ఆత్మకూరులో జిల్లాస్థాయి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2025-26 రెండవ విడత నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ... పీఎం కిసాన్ మెగా చెక్కును ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 46.22 లక్షల మంది రైతులకు రూ. 3,077 కోట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జమ చేశారని, దీంతో జిల్లా స్థాయిలో 1,95,866 మంది రైతులకు రూ.130.20కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34,223 మంది రైతులకు రూ.22.95 కోట్లు లబ్ది చేకూరనుందని వివరించారు.

### ఆత్మకూరు సమస్యలు తీరుస్తా :

ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంత రైతుల కోసం సోమశిల హై లెవెల్ కెనాల్ పనులను మొదలుపెట్టేందుకు, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కృషి చేస్తానని మంత్రి ఆనం తెలిపారు. ఈ రెండు ప్రధాన సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి వీటి సాధనకు కృషి చేస్తామన్నారు. సోమశిల హైలెవెల్ కెనాల్ పూర్తయితే మర్రిపాడు వరకు సోమశిల జలాలతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని, ఆ కాలువ ద్వారా 90వేల మంది జనాభాకు తాగునీరు, 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి చెప్పారు.

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, ఈ కష్టకాలంలో ఒక్కొక్క రైతుకు రూ.7 వేలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు.

### బాధితులకు అండగా..సీఎం రిలీఫ్ ఫండ్ :

రాష్ట్రంలో పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటూ వారి జీవితాలకు తమ ప్రభుత్వం వెలుగుబాటలు వేస్తోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 45 మంది బాధిత కుటుంబాలవారికి ఆయన బుధవారం నాడు సుమారు రూ. 31.25 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా, పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రమాదాల్లో మృతి చెందిన ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు రూ 5 లక్షల వంతున బీమా మొత్తాన్ని అందజేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ, వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రూరల్‌లో..

# 'చంద్రన్న పార్కుల బాట'

### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల విలువ చేసే పార్కుల స్థలాలను కబ్జాదారుల పరం కాకుండా కాపాడుకుంటూ, వాటి అభివృద్ధికి బాటలు వేస్తూ 'చంద్రన్న పార్కుల బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన పార్కుల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అండదండలతో, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 29 పార్కులను విడతలవారీగా విద్యుద్దీపాలతో దేదీప్యమానం చేస్తామని, భవిష్యత్తులో మరింతగా వాటిని తీర్చిదిద్దుతామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

# 'ఆల్తూరు' పూజలు

కార్తీక అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ బుధవారం నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజారాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో పోలి అమావాస్య పూజలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ సుందరేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు వైభవంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళాభక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి శివనామ స్మరణ చేసుకున్నారు. శివభక్తులు, దాత ఆల్తూరు గిరీష్‌రెడ్డి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

లాయర్
నవంబర్ 21, 2025

# మహిళలపై పెరిగిపోతున్న అకృత్యాలు..అత్యాచారాలు!

దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారు. ఎన్నో సాహసోపేత ఉద్యోగాల్లోనూ రాణిస్తున్నారు. విద్యలో, ఉపాధిరంగాల్లోనూ ఉత్తమస్థాయిలో ఫలితాలు సాధిస్తూ అటు కుటుంబానికి, ఇటు సమాజానికి తమవంతు సేవలందిస్తూనే ఉన్నారు. అయితే, ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు అబలలు, అసహాయులైన మహిళలెందరో నిరంతరం అనేకరకాల హింసలను అనుభవిస్తున్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై హింస ఏడాదికేడాది పెరిగిపోతూనే ఉంది తప్ప, తరగడమన్నదే ఉండడం లేదు. అత్యాచారాలు-హత్యలు కూడా మితిమీరిపోతున్నాయి. బాలికల స్థాయి నుంచి వృద్ధుల దాకా సమాజంలో మహిళలు పడుతున్న బాధలకు అంతే ఉండడం లేదు. గృహహింసలు, లైంగిక వేధింపులు సర్వత్రా సర్వసాధారణమైపోయాయి. ఎక్కడ చూసినా మహిళలకు నేటికీ వేదనలే తప్ప సంతోషం అన్నది ఉండడం లేదు. సాంకేతికత ఆకాశానికంటుతున్నా, మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలెన్ని వచ్చినా, ప్రభుత్వాలు మహిళల సంక్షేమానికి, భద్రతకు గతంలో కంటే మెరుగ్గా ఎన్నో రకాల చర్యలు తీసుకుంటున్నా మహిళల స్థితిగతుల్లో పెద్దగా మార్పులు ఉండడం లేదు. స్త్రీలకు సాధికారత అనేది అందని ద్రాక్షలాగానే ఉంది. పురుషాహంకారానిదే రాజ్యమైపోయిన నేటి కాలంలో స్త్రీలపై జరుగుతున్న దౌష్ట్యాలు అన్నిన్ని కాదు. ఆడపిల్లలపై యాసిడ్ పోయడాలు, కిడ్నాప్‌లు చేసి అత్యాచారాలు, హత్యలు చేయడాలు వంటి ఎన్నో ఘోరాలను నేరాలను మనం ప్రసారమాధ్యమాల్లో చూస్తూనే ఉన్నాం. ప్రేమ పేరుతో, పెళ్ళి పేరుతో నయవంచనలు, ఆ తర్వాత అనుమానాల పేరుతో దౌర్జన్యకాండలు జరిగిపోతూనే ఉన్నాయి. వాటిని సహించలేక ఎందరో ఆడపిల్లలు, మహిళలు, గృహిణులు సైతం చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఎంతో బాధాకరం.

దేశంలో మహిళలపై హింస నానాటికీ పెరిగిపోతూనే ఉందంటూ జాతీయ మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మహిళలపై నేరాలకి సంబంధించిన కేసులు లక్షల సంఖ్యలోనే ఉందంటే అతిశయోక్తి కాదు. అయితే చాలా కొద్ది కేసుల్లో మాత్రమే నిందితులపై శిక్షలు పడుతున్నాయని తేటతెల్లమవుతోంది. దేశంలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్రల్లో మహిళలపై నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నేటికీ వరకట్న వేధింపులు వంటివి కూడా తగ్గడం లేదని కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలపై అత్యాచారాలకి సంబంధించిన కేసుల్లోనూ నిందితులకు శిక్షలు పడడం అంతంతమాత్రంగానే ఉందని గణాంకాలు చెప్తున్నాయి. 2018 నుంచి 2023 దాకా ప్రతి ఏటా సుమారు 30వేలకి పైగానే అత్యాచారాలు కేసులు నమోదవుతున్నా, శిక్షలు పడినవారి సంఖ్య మాత్రం ఏటా 5 వేలకి కూడా మించడం లేదు. దేశవ్యాప్తంగా ఏటా వేలసంఖ్యలో అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మహిళలపై జరుగుతున్న నేరాలు లక్షల్లోనే ఉన్నా, కేసులు మాత్రం చాలా స్వల్ప సంఖ్యలోనే ఉంటున్నాయి. కుటుంబ కారణాల వల్లనో, పరువు సమస్య వగైరాలతో సున్నిత మనస్కులైన మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలను బయటకు చెప్పుకోలేకపోతున్నారని నిపుణులు చెప్తున్నారు.

ఇంకోవైపు, సాంకేతిక విజ్ఞానం పెరుగుతున్నకొద్దీ మహిళలపై డిజిటల్ వేధింపులు కూడా తప్పడం లేదు. జరుగుతున్న నేరాల్లో, బాగా పరిచయం ఉన్నవారు చేసినవి 98శాతానికి పైగానే ఉంటున్నాయని జాతీయ నేర గణాంక సంస్థ తన నివేదికలో స్పష్టం చేసిందంటే పరిస్థితి ఎంత దిగజారిపోతోందో ఊహించుకోవచ్చు. చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువులు, సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైనవారిలో కూడా అనేకమంది ఈ నేరాలకు పాల్పడుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌ని ఉదాహరణగా తీసుకున్నా, 2023లో జరిగిన 438 అత్యాచార కేసుల్లో 433 కేసులకు సంబంధించిన నిందితులు బాధిత మహిళలకు తెలిసినవారేనంటూ నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలను అడ్డం పెట్టుకుని ఏర్పడ్డ పరిచయాల ద్వారా ఆయా మహిళలపై అకృత్యాలకు పాల్పడేవారి సంఖ్య గణనీయంగానే ఉంటోంది. ప్రభుత్వాలు మహిళల రక్షణకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఇంటా బయటా స్త్రీలు ధైర్యంగా, సంతోషంగా ముందడుగు వేయగలిగినప్పుడే వారికి నిజమైన పురోగతి.. అదే మహిళాలోకానికి అసలైన సాధికారత కూడా!..

**- (నవంబరు 25, అంతర్జాతీయ స్త్రీహింసా వ్యతిరేక దినం)**


## బీహార్‌లో మోత మోగించిన మోడీ!

ఎవరు అవునన్నా.. ఎవరు కాదన్నా, భారతీయ జనతా పార్టీ ప్రధాన ఆకర్షణ మన భారత ప్రధాని. 140 కోట్ల భారతీయుల అభిమాన నాయకుడు నరేంద్ర మోడీ. ఆయనపై భారతీయులకి ఉన్న మోజు మరోసారి రుజువయ్యింది. బీహార్ ప్రజలు ఎన్.డి.ఏకి ల్యాండ్ స్లయిడ్ విక్టరీని అందించారు. భాజపాని అత్యధిక సీట్లలో గెలిపించారు. అంతేకాకుండా రెండు దశాబ్దాలుగా తిరుగులేని నాయకుడిగా చక్రం తిప్పుతున్న నితీష్‌కుమార్‌కి ఇది నీ ఒక్కడి ఘనత కాదు అన్న సందేశాన్ని కూడా ఇచ్చారు. కేవలం అయిదు సీట్లకి పరిమితం చేసి కాంగ్రెస్‌ని ఖంగు తినిపించారు. ఈ ఫలితాలు దేశంలోని ఇతర రాష్ట్ర రాజకీయాలని సైతం ప్రభావితం చేస్తాయనడంలో సందేహం అవసరంలేదు. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ప్రాభవం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో బీజేపీకి ఈ విజయం బాగా ఉపకరిస్తుంది. జాతీయ పార్టీల అండతోనే అభివృద్ధి సాధ్యం అన్న నినాదాన్ని క్రమేణా ప్రజలలోకి తీసుకువెళ్ళడంలో కమలనాధులు సఫలీకృతమవుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగితే దక్షిణ భారతం కూడా కాషాయ హస్తగతం కావడం ఖాయంగా కనిపిస్తుంది!

యం. చంద్రమౌళి, **కొత్తఢిల్లీ.**

## సిగ్గు విడిచిన ఆ ఐ.ఏ.ఎస్!

గత ప్రభుత్వంలో అతి కీలకంగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా పదహారు నిమిషాల నిడివి గల ఓ వీడియోని విడుదల చేశాడు. 'పబ్లిక్ అపాలజీ'(బహిరంగ క్షమాపణ) అన్నది ఆ వీడియో సారాంశం. తాను చాలా నీతిమంతుడనని, ఎక్కడా ఒక్క పైసా అవినీతి చేయలేదని ఆయన ఈ వీడియోలో చెప్పుకున్నాడు. అయితే, ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారం ఒక ఐపిఎస్, ఒక ఐఆర్ఎస్ అధికారులకి అన్యాయం చేశానని ఒప్పుకున్నాడు. ఆ ఇద్దరు అధికారులు తనని క్షమించాలని బహిరంగంగా వేడుకున్నాడు. ప్రస్తుతం ప్రవీణ్ ప్రకాష్ కూడా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నాడు. అంతరాత్మ సాక్షిగా ఇలా ఇద్దరు ఉన్నతాధికారుల భవిష్యత్తుతో ఆడుకున్నానని ఆయన నిస్సిగ్గుగా చెప్పుకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ పెట్టిన వీడియో ప్రస్తుతం విధులలో వున్న ఐఏఎస్, ఐపిఎస్ అధికారులకి చెంపపెట్టు లాంటిది. కనీసం ఈ వీడియో చూసైనా వారికి కనువిప్పు కలగాలని కోరుకుంటున్నాను. దుర్మార్గమైన రాజకీయ నాయకుల వత్తిళ్ళకి లోనై ఇలాంటి నీచమైన దిగజారుడు చర్యలకి ఏ అధికారీ పాల్పడకూడదని నా ఆకాంక్ష. - డి.హరిత, **గూడూరు.**




## జిల్లా అంతటా కార్తీక వెలుగులు!

ఈసారి కార్తీక మాసం మొత్తం నెల్లూరుజిల్లా కళకళలాడింది. కార్తీక దీపోత్సవ కాంతులు జిల్లా నలుమూలలా ప్రకాశించాయి. వ్యక్తులు, సంస్థలు, దేవస్థానాల నిర్వాహకులు పోటీలుపడి మరీ దీపోత్సవాలు నిర్వహించారు. కార్తీకమాసం లాంటి ప్రత్యేక రోజుల ప్రాముఖ్యతని, ప్రాశస్త్యతని రేపటి తరానికి తెలియజేసేలా ఈ మాసం దేదీప్యమానం కావడం సంతోషదాయకం. భవిష్యత్తులో వచ్చే అన్ని సంప్రదాయ పండుగలు, ప్రత్యేక మాసాలు ఇదే ప్రాముఖ్యతతో, ఇదే స్ఫూర్తితో, ఇదే భక్తితత్వంతో నిర్వహించుకుంటే చాలు హిందుత్వం వర్ధిల్లుతుంది. జై శ్రీరామ్..!

ఏం. రామ్మోహన్‌రావు, **సంతపేట.**




## మితిమీరిపోతున్న సైబర్ నేరాలు!

అంతర్జాలం ఆధారంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వెర్రితలలు వేస్తున్న తరుణంలో ఆర్థిక నేరాలు కూడా అంతకంతకీ పెరిగిపోతున్నాయి. మాదకద్రవ్యాల కొరియర్లు, డిజిటల్ అరెస్టులు, అక్రమ లావాదేవీలూ అంటూ రకరకాల కారణాలు చూపిస్తూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేరు ఉద్యోగిని ఖాతా నుండి ఏకంగా 32.83 కోట్ల రూపాయలని కాజేశారు. ప్రభుత్వం పదేపదే హెచ్చరిస్తున్నా.. టీవీల ద్వారా, పత్రికల ద్వారా ప్రజలని అప్రమత్తం చేస్తున్నా.. ఇలా ఉన్నత చదువులు చదివిన మహిళ కూడా సైబర్ ముఠా వలలో చిక్కుకోవడం విచారకరం. మన కేంద్రప్రభుత్వం పార్లమెంటులో అధికారికంగా ప్రకటించిన లెక్కల ప్రకారం కేవలం గత ఏడాది కాలంలోనే 22,845 కోట్ల రూపాయలని ఈ సైబర్ మాయగాళ్ళు ప్రజలనుండి దోచుకున్నారు. రాష్ట్రాల వ్యాప్తంగా లెక్కిస్తే రోజుకి 10కోట్ల రూపాయలు జనాల ఖాతాల నుండి మాయమైపోతున్నాయని అంచనా వేస్తున్నారు.

దర్జాగా కాలుమీద కాలేసుకుని, చేతిలో ఫోన్ పట్టుకుని, టేబుల్‌పై కంప్యూటర్ పెట్టుకుని లక్షలకి లక్షలు సునాయాసంగా సైబర్ కేటుగాళ్లు దోచేసుకుంటున్నారు. చేతిలోకి ఫోన్‌లు, కంప్యూటర్లలోకి అంతర్జాలం వచ్చాక అసలైన విజ్ఞానం కాకెత్తుకుపోయింది. చోర పరిజ్ఞానం మాత్రం ఆకాశమంత ఎత్తుకి ఎదిగిపోయింది. దానిని అడ్డంపెట్టుకుని దోపిడీదారులు చేస్తున్న మోసాలకి లెక్కేలేదు. వాటినే సమాజం 'సైబర్ నేరాలు' అంటోంది. ఈ ఆధునిక ఘరానా దొంగలు ప్రభుత్వాలకీ, పోలీసులకి కూడా దొరక్కుండా ఎక్కడో ఏ మారుమూల దేశంలో ఇరుకు గదుల్లో కూర్చుని ఉంటారు. ఫోన్లలోనో, అంతర్జాలంలోనో రకరకాల మాయలు చేసేస్తుంటారు. తెలివిగా జనాన్ని దోచేసుకుంటుంటారు. మామూలు జనంతో పాటు, రాజకీయ నాయకులని, ప్రభుత్వ అధికారులని సైతం ఈ సైబర్‌ముఠా వదిలిపెట్టడం లేదు. తమ మాయ మాటలతో బురిడీకొట్టించి లక్షలకి లక్షలు డబ్బు గుంజేస్తున్నారు. కేవలం మనదేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడచూసినా సైబర్ మోసగాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. ఈ ముఠా రానురాను సమాజానికి పెనుసవాలుగా అవతరించిందంటే అతిశయోక్తి కాదు.

### సైబరాసురుల మోసాలకి, మాయాజాలాలకి హద్దే లేదు!

దోపిడీ దొంగలకి కత్తులు, గునపాలు, తాళ్ళు, ముసుగులు ఎలాగో.. ఇప్పుడు సైబర్ నేరగాళ్ళకి కేవలం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లే వారి దోపిడీలకు ఉపయోగపడే పరికరాలు. సులభంగా డబ్బు సంపాదించడమే వారి ధ్యేయం. ఫిషింగ్‌వేర్, మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ ఇలా రకరకాల వేర్‌లతో మోసాలు చేసేస్తుంటారు. కేవైసీ ఇవ్వండి, ఓటీపీ చెప్పండి అంటూ అమాయకుల నుండి వివరాలు రాబట్టేస్తుంటారు. ఇక, ఫోన్లని ట్యాప్ చేయడం, ఇ-మెయిళ్ళకి నకిలీ సందేశాలు పంపడం, వెబ్‌సైట్‌ల ద్వారా అవతలివారి వ్యక్తిగత సమాచారాన్నంతా అపహరించి వారినే బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు సంపాదించడం ఇలాంటివన్నీ సైబర్ ముఠాలకి వెన్నతో కాదు వేళ్ళతో అబ్బిన విద్య. అవతలివారి కంప్యూటర్లలోకి సైతం జొరబడి డేటాను దొంగిలించేయడం, లేదంటే వాళ్ళ కంప్యూటర్లను పనికిరాకుండా చేసి, తద్వారా డేటాను చోరీచేసి, దాన్ని వాళ్ళు తిరిగి కావాలనుకుంటే పెద్దమొత్తాల్లో డబ్బు డిమాండ్ చేయడం వంటి కార్యకలాపాలలో వీళ్ళు ఆరితేరిపోయారు. కొంతమంది ఉద్యోగాలిస్తామంటారు. మరికొందరు ఎంత డబ్బు కావాలన్నా అప్పుగా ఇస్తామంటారు. మనం వారి వలలో చిక్కాక మనల్ని కీలుబొమ్మలని చేసి ఆడిస్తారు. బ్యాంకుల వాళ్లమనో, సిబిఐ వాళ్ళమనో, ఇన్‌కమ్‌టాక్స్ అధికారులమనో దబాయిస్తారు. 'మీ వాట్సాప్‌ని స్క్రీన్‌షాట్ చేసి పంపించండి, అర్జంట్' అంటారు. ఆ తర్వాత మన వివరాలన్నీ తెలుసుకుని మన ఖాతాల్లో డబ్బుని వాళ్ళ ఖాతాల్లో వేసుకుని మనకి పంగనామాలు పెడతారు. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ ఎవరికి వారు జాగ్రత్తగా ఉండడం తప్ప మరో మార్గం లేదు.

### రాజకీయ నేతలని, అధికారులని కూడా బురిడీ కొట్టించేస్తున్నారు!

సైబర్ దొంగలు ఇటీవలికాలంలో బరితెగిస్తున్నారు. నేరుగా రాజకీయ నేతలకి, ప్రభుత్వశాఖల అధికారులకి కూడా ఫోన్‌చేసి, తాము ఏసీబీ, సిబిఐ లేక ఇన్‌కమ్‌టాక్స్ నుండి మాట్లాడుతున్నామని, మీమీదికి రైడింగ్‌కి వస్తున్నామని హూంకరిస్తూ మాట్లాడతారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేశాం, ఎక్కడికీ కదలకండి అంటూ హడలెత్తిస్తారు. మేమొచ్చామంటే మీ పని అయిపోయినట్లేనని బెదరగొట్టేస్తారు. అవతలివారు భయపడి, తమ మీద దండెత్తకుండా ఉండడానికి ఎంతకావాలో చెప్పండని బతిమాలుకుంటారు. దీంతో సైబరాసురులు లక్షలకి లక్షలు డిమాండ్ చేస్తారు. వారి ఖాతాల్లోకి డబ్బులేసి, తీరా వారెవరా అని ఆరాతీస్తే.. ఇంకేముందీ, వారే 'సైబర్ ముఠా'.

### వీడియో కాల్స్ ద్వారా సైతం!

ముఖ్యంగా ప్రభుత్వశాఖలలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారిని వీళ్ళు ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. పోలీసు వేషాలలో ఆఫీసులో కూర్చుని వున్నట్లుగా సినిమా సెటప్పులు వేసి వీడియో కాల్స్ చేస్తున్నారు. తాము నిజంగా పోలీసు ఉన్నతాధికారులమే అన్నట్లుగా అవతలి వారిని నమ్మిస్తున్నారు. "మా పెద్దసారు మాట్లాడుతారు" అంటూ ఫోన్‌లో ఓ డూప్లికేట్ అధికారిని చూపిస్తారు. నిజంగానే సీబీఐ, ఇన్‌కమ్‌టాక్స్ లేదా కస్టమ్స్ వాళ్ళే కాల్ చేసినట్లుగానే నమ్మిస్తారు. ఇక వాళ్ళ దగ్గర దొరికిన మేరకు దోచేస్తారు. తాము బ్యాంకు అధికారులమని చెప్పి కూడా తరచూ ఏదోఒక విధంగా మన వివరాలు సేకరించడానికి ఈ సైబర్‌దొంగలు ప్రయత్నిస్తూనే వుంటారు. వారికి నిరంతరం ఇదే పని. వారి వలకి తగులుకున్నామంటే వదులుకోవడం కష్టం. కనుక, మనమే అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి. మనబ్యాంకు ఖాతా వివరాలని, పాస్‌వర్డ్‌ని, ఆధార్ సమాచారాన్ని, ఓటీపీలని ఎవరికీ చెప్పకూడదు. ***ఈ సైబర్ నేరాల బారిన పడకుండా ఫిర్యాదు చేయడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో 1930 నంబరుని కేటాయించింది.*** మనకి అనుమానం వస్తే, వెంటనే ఆ నంబరుకి కాల్‌చేసి సమాచారమివ్వాలి. అంతే తప్ప పొరపాటున కూడా అపరిచితులకి మన గురించిన ఎలాంటి సమాచారం ఇవ్వకూడదు. ఇస్తే అంతే సంగతులు. మన సొమ్ముని మనమే కాపాడుకోవాలి. లేదంటే.. "అయ్యయ్యో బ్యాంకులో డబ్బులు పోయనే" అని పాడుకోవాలి. తస్మాత్ జాగ్రత్త...!

- రాజశ్రీ

## మంచి జీవనశైలితో..
# మధుమేహం నియంత్రణ

- అపోలో ఆసుపత్రి వైద్యులు




మంచి జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్లతో మధుమేహాన్ని అదుపులో ఉంచు కోవచ్చుని అపోలో వైద్యులు సూచిస్తున్నారు. నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, యూనిట్‌హెడ్ డాక్టర్ బిందురెడ్డి తదితరులు పాల్గొని మధుమేహంపై రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధులలో మధుమేహం ఒకటని, అధిక బరువు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, వంశపారంపర్య ప్రభావం వంటి అంశాలు మధుమేహానికి ప్రధాన కారణాలని తెలిపారు. మధుమేహం ఉన్నవారిలో రక్తపోటు, హృద్రోగాలు, కిడ్నీజబ్బులు, కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం అవసరమని, ప్రతిరోజూ కనీసం అర్ధగంటపాటు వ్యాయామం చేయాలని, తక్కువ చక్కెర, తక్కువ కొవ్వు కలిగిన ఆహారం తీసుకోవాలని, బరువును నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా తమ అపోలో ఆసుపత్రిలో రూ.2100 విలువైన ఆరోగ్య పరీక్షలని కేవలం 699 రూపాయలకి, రూ. 4500 విలువైన వైద్య పరీక్షలను కేవలం 1899 రూపాయలకే నిర్వహిస్తున్నామని, మధుమేహ బాధితులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# బడిపిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టండి

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు



బడిపిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అధికారులకు చెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన ఇటీవల నెల్లూరుజిల్లాకు వచ్చి కందుకూరు నియోజకవర్గంలోని కందుకూరు, గుడ్లూరు మండలాల్లో పర్యటించారు. గుడ్లూరులో జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కందుకూరు మండలంలో మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్, కందుకూరులోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల హైస్కూళ్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో రుచి చూశారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రుచిగా, శుచిగా పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు.

# రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో.. బాలల పండుగ



బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14న..నెల్లూరు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో వేడుకలు జరిగాయి. రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొని పిల్లలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన విద్యార్థులకు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలలో పాల్గొన్న స్పాస్టిక్స్ సెంటర్ చిన్నారులకు బహుమతులను, పండ్లను స్టైల్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్.కె.పర్వీన్ అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్స్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపాల్ ఉదయ్‌భాస్కర్, చిన్నారులు.. వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నెరవేరుతున్న..పేదల సొంతింటి కల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదలు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ఇళ్ల నిర్మాణాల్లో కదలిక వచ్చిందని, త్వరలోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ముత్తుకూరు మండలం పిడతాపోలూరు గిరిజనకాలనీలో గిరిజనుల నూతన గృహ ప్రవేశాల్లో ఆయన పాల్గొని 38 ఇళ్లలో గిరిజనులను గృహప్రవేశాలు చేయించారు. గిరిజన దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనుల ఇంటికి ఇచ్చే మొత్తానికి మరో రూ.75 వేలు పెంచి రూ.2.55 లక్షలు ఇస్తున్నారని, ఇందులో రూ. 1.80 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, రూ. 75 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు



రూ.50 వేలు పెంచి రూ.2.30 లక్షలు అందిస్తున్నారన్నారు. పిడతాపోలూరులో వైసీపీ హయాంలో అరకొరగా ఇళ్ళు కట్టి వదిలేశారని, ఫ్లోరింగ్ లేదు.. ప్లాస్టరింగ్ లేదు.. తలుపులు.. కిటికీలు లేవంటూ ఆయన ధ్వజమెత్తారు.

## వింజమూరు బాలునికి..
# 'ఉత్తమ విద్యార్థి' అవార్డు



వింజమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గోసాల ఏసురత్న జోసెఫ్‌కి జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యార్థి పురస్కారం లభించింది. డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి యన్.యమ్.డి ఫరూక్ చేతులమీదుగా జోసెఫ్ ఆ పురస్కారంతో పాటు నగదు బహుమతిని కూడా అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ మాలకొండయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

# 30న.. 'వేద విజ్ఞాన వేదిక' సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో 167వ ప్రసంగంగా ఈనెల 30న 'రామాభ్యుదయ కావ్య సౌందర్యం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటుచేశారు. చెన్నై టీనగర్‌లోని కృష్ణాహాల్, ఆంధ్రాక్లబ్‌లో వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుంది. సుప్రసిద్ధ శతావధాని తాతా సందీప్‌శర్మ (హైదరాబాద్) పాల్గొని 'రామాభ్యుదయ కావ్య సౌందర్యం' అనే అంశంపై ప్రసంగించనున్నారని, సాహితీవేత్తలు- సాహిత్యాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# నెల్లూరులో.. ఎక్స్ ప్రెస్-వే నిర్మించాలి

## కేంద్రమంత్రి గడ్కరీకి సోమిరెడ్డి లేఖ

హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్-వే తరహాలోనే నెల్లూరులో కూడా ఎక్స్‌ప్రెస్-వే నిర్మిస్తే, అటు ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. నెల్లూరులోని పెన్నానది నుంచి బుజబుజనెల్లూరు వరకు ఎక్స్‌ప్రెస్-వే నిర్మాణంతో ప్రజలకు పలు ఇబ్బందులు తీరుతాయన్నారు. నెల్లూరు-చెన్నైల మధ్య జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు అనుమతి ఇచ్చినందుకు తొలుత ఆయన కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్పగుడి, కనుపర్తిపాడు, చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జిల (ఆర్.యూ.బీ) నిర్మాణాలు చేపట్టినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. పెన్నానది వద్ద నుంచి బుజబుజనెల్లూరు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నెల్లూరు నగరం వేగంగా విస్తరిస్తోందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# శ్రీసిటీ పరిశ్రమల ఔదార్యం!

- రూ.58 లక్షలతో విద్యావసతుల కల్పన




శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని పరిశ్రమలు తమ ఔదార్యాన్ని చాటుకుంటూ, పరిసర ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యావసతులు కల్పిస్తున్నాయి. తాజాగా శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్వీ పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.58 లక్షలతో నిర్మించిన నూతన విద్యా వసతులను ఆయా సంస్థల ప్రతినిధులు ఈనెల 17న ప్రారంభించారు. సత్యవేడులో 46లక్షల రూపాయలు వెచ్చించి 3 విశాల గదులతో నిర్మించిన బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ ఇండియా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ హాజీమే కజోకా, శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి వాటికి ప్రారంభోత్సవాలు చేశారు. శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మునీంద్ర, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ డీజీఎం వెంకటేష్, సిఎస్ఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా, శ్రీసిటీలోని చార్ట్-వీఆర్వీ పరిశ్రమ రూ.12లక్షల ఖర్చుతో సత్యవేడు మండలం వానెల్లూరు గ్రామంలో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, వంట గదులను వీఆర్వీ సంస్థ డైరెక్టర్ (హెచ్ఆర్) యామిని సిన్హా, తయారీ విభాగం హెడ్ ప్రసంజిత్ ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్వీ సంస్థలను శ్రీసిటీ డైరెక్టర్(సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి అభినందించారు.

# 25వ తేదీలోగా.. స్మార్ట్ రైస్‌కార్డులు తీసుకోవాలి

నెల్లూరు జిల్లాకు సంబంధించి స్మార్ట్ రైస్‌కార్డులు మొత్తం 7,10,998 మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 6,35,716(89%) మాత్రమే ఆ కార్డులు తీసుకుని ఉన్నారని, ఇంకా 75,282 కార్డులు తీసుకోవలసివుందని జిల్లా పౌరసరఫరాల అధికారిణి లీలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ రైస్‌కార్డులు తీసుకోవలసిన కార్డుదారులందరూ ఈనెల 25వ తేదీలోగా మీ చౌక దుకాణ డీలరు వద్ద కానీ, సచివాలయం వద్ద కానీ సంప్రదించి కార్డులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాకు సంబంధించి 20,17,681 యూనిట్లు ఈకేవైసీ చేయాల్సి వుండగా, 19,41,252 యూనిట్లకు మాత్రమే ఈకేవైసీ చేశారు. ఇంకా 76,429 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సిందని తెలిపారు. రైస్ కార్డులలోని సభ్యులందరూ కూడా తప్పకుండా, మీకు దగ్గరలో ఉన్న చౌక దుకాణ డీలరును సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.



# రోడ్ల నిర్మాణాలకి శంకుస్థాపనలు

నెల్లూరు నగరాభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఈనెల 17న రెండు ప్రధానమైన రోడ్ల నిర్మాణాలకి శంకుస్థాపనలు చేశారు. సండే మార్కెట్ వద్ద రోడ్డు నిర్మాణ పనులకు, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద కోటి రెండు లక్షలతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి రోడ్డు నిర్మాణాన్ని 44 రోజుల్లో పూర్తిచేస్తామని, డిసెంబర్ 31వతేదీన ఈ రోడ్డును ప్రారంభిస్తామని తెలియజేశారు. మరో కోటి రూపాయలతో డిసెంబర్ 31న రెండో సైడ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఫిబ్రవరి 15న ఆ రోడ్డును ప్రారంభిస్తామన్నారు. సండే మార్కెట్లో వర్షాల సమయంలో నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కమిషనర్ నందన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### కాపు భవన్‌కి.. మరో కోటి విరాళం

అసంపూర్తిగా ఉన్న కాపు భవనాన్ని త్వరలోనే పూర్తిచేస్తామని మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు.. దాని అభివృద్ధికి తన పిల్లలు కోటి రూపాయలు ఇస్తారని ఆయన ప్రకటించారు. దాంతో పాటు సివిఆర్ ఫండ్స్ ద్వారా మరో కోటి రూపాయలు ఇప్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కాపు భవన్‌లో ఇటీవల జరిగిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో తన సతీమణి రమాదేవితో కలిసి ఆయన పాల్గొన్నారు.

# స్ఫూర్తి నింపిన కవిసమ్మేళనం



జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు కార్యదర్శి కుమార్‌రాజా నేతృత్వంలో జరిగాయి. అందులో భాగంగా ఈనెల 17వతేదీన కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కవిసమ్మేళనంలో దాదాపు 25 మంది పాల్గొని తమ స్వీయ కవితల్ని వినిపించారు. ఈతకోట సుబ్బారావు, గోవిందరాజు సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్‌బాబు, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, ఇసనాక దయాకరరెడ్డి, మామిడి వెంకటేశ్వరరావు, తోట సులోచన, వాయుగుండ్ల శశికళ, ఇంద్రగంటి మధుసూదన్, పార్లపల్లి నాగేశ్వరిలు పాల్గొని కవితలతో అలరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ కృష్ణమోహన్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా తదితరులు చిన్ని నారాయణరావుతో పాటు కవులను, కవయిత్రులను సన్మానించారు.

## నెల్లూరు కబుర్లు

# జల సంరక్షణలో.. జిల్లా భేష్!

### కేంద్రమంత్రి నుండి అవార్డు అందుకున్న కలెక్టర్



జల సంరక్షణలో.. నెల్లూరు జిల్లాకి ఇటీవల జాతీయస్థాయి గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. 'జల్ సంచయ్ జన్ భగీదారీ' కార్యక్రమంలో భాగంగా, వాననీటిని ఒడిసి పట్టి భూగర్భజలాల పెంపుదలతో పాటు జల సంరక్షణలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నేతృత్వంలో అధికారుల పనితీరుకు జిల్లాకు జాతీయస్థాయిలో అవార్డు లభించింది. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇటీవల ఆ అవార్డు అందుకున్నారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకుల నిరసన



హిందూపురం వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడి దారుణమంటూ నెల్లూరులో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇటీవల నల్లరిబ్బన్లు ధరించి నిరసనలు చేపట్టారు. ఈ ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ, టీడీపీ అరాచక పాలన చేస్తోందంటూ వైసీపీ నాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు ధ్వజమెత్తారు. హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ వారు దాడి చేశారని, టీడీపీ అకృత్యాలకు ఇదో నిదర్శనమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి, వారి అన్యాయాలను ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయిస్తూ, జైల్లో పెట్టిస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారంటూ దుయ్యబట్టారు. టీడీపీదంతా రెడ్‌బుక్ పాలన అంటూ వైసీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ దారుణాలను చూస్తున్న ప్రజలు మళ్లీ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ నిరసనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్‌విఆర్ ఫౌండేషన్.. రక్తదాన శిబిరం



నెల్లూరు రెడ్‌క్రాస్, ఆర్‌విఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రక్తదాన శిబిరం జరిగింది. సుమారు 30 మందికి పైగా దాతలు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు జనార్దన్‌రాజు, ఆర్‌విఆర్ ఫౌండేషన్ ట్రస్టీ ఆర్‌విఆర్ మోహన్‌రాజు తదితరులు పాల్గొని రక్తదానమంటే ప్రాణదానం చేయడమేనంటూ రక్తదానం విశిష్టతను తెలియజెప్పారు. ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మోహన్‌రాజు తెలిపారు.

### ఆర్చరీలో సత్తాచాటిన..

# డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు



స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఇటీవల పాడేరులో నిర్వహించిన ఆర్చరీ (విలువిద్య) పోటీల్లో నెల్లూరుకి చెందిన డా.కిషోర్స్ రోషిణి రత్నం స్కూల్ విద్యార్థులు తమ సత్తాచాటుకున్నారు. పి.భావజ్ఞ హంసిని (7వ తరగతి) ఇండియాన్ బో విభాగంలో, కె.మోక్ష (8వ తరగతి) రికర్వ్ విభాగంలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకి ఎంపికయ్యారు. ఈనెలలోనే వారణాసిలో జరుగనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో వీరు పాల్గొనబోతున్నారు. అదేవిధంగా, రత్నం టెక్నో స్కూల్ విద్యార్థిని ఎస్.హరిణి నిత్య రాష్ట్రస్థాయి పోటీల్లో టీమ్ మెడల్‌ని సాధించింది. విజేతలను డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాం!

### కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్‌లో 17 ఎకరాల విస్తీర్ణం కలిగి, 300కోట్ల రూపాయల విలువ కలిగిన పార్కులకు చెందిన ప్రభుత్వ భూమిని, 6 కోట్ల 70లక్షల రూపాయల వ్యయంతో ప్రహరీ గోడలు నిర్మించి, కబ్జాదారుల నుండి కాపాడామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్, హౌసింగ్ బోర్డ్ కాలనీలో 24 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్‌లలో ఉన్న పార్కులలో 35లక్షల రూపాయల వ్యయంతో 2370 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, స్థానిక ప్రజలందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# మైపాడు గేట్ సెంటర్‌లో లక్ష దీపోత్సవం



కార్తీక మాసం సందర్భంగా ఇటీవల నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లోని జాఫర్ సాహెబ్ కాలువ ఘాట్ వద్ద కార్తీక మాస లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. స్థానిక నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఆనం వెంకటసుబ్బారెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, సంక్రాంతి కళ్యాణ్, కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, తాళ్లపాక అనురాధ, ముక్కాల ద్వారకానాథ్, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కొమ్మూరి విజయ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విధులను బహిష్కరించిన న్యాయవాదులు

తిరుపతికి చెందిన న్యాయవాది ఏ.రాజశేఖర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా ఈనెల 18న నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులిమి అయ్యప్పరెడ్డి, ఎన్.నాగరాజు, బార్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.






## మంత్రి నారాయణ కృషితో..

# ప్రయివేటుకి ధీటుగా.. ప్రభుత్వ పాఠశాలలు!

ప్రస్తుతం ఆయన రాష్ట్ర పురపాలక మంత్రి. అంతకుముందు ఆయన విద్యాసంస్థలకి అధినేత. కొన్ని లక్షలమంది విద్యార్థినీ విద్యార్థులకి స్ఫూర్తిదాత. ఒక్క భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో సైతం తన సొంత పేరుతో నారాయణ విద్యాసంస్థలని విస్తరింపజేసిన విద్యావేత్త. ఆయనే పొంగూరు నారాయణ. అతి పేద కుటుంబం నుండి వచ్చిన ఆయనకి పేద విద్యార్థుల చదువుల బాధలు తెలుసు. బాగా చదువుకోవాలని వారు పడే తపన తెలుసు. ఇవన్నీ ఆయన స్వయంగా అనుభవించినవే. అందుకనే ఆయన నెల్లూరు నగరంలో శిథిలావస్థలో ఉన్న మునిసిపల్ పాఠశాలలపై దృష్టిపెట్టారు. వాటి అభివృద్ధి కోసం దీక్ష పట్టారు. అందుకోసం అవసరమైన దానకర్ణులని వెతికిపట్టారు. పాఠశాలల రూపురేఖలు మార్చే పనిని చేపట్టారు. మనస్ఫూర్తిగా ఎవరైనా ముందుకు రావాలంటే వారికి తానే స్ఫూర్తి కావాలని సంకల్పించారు. గత ప్రభుత్వంలో మూతబడి, పాడుబడిపోయిన చారిత్రాత్మక పాఠశాల వీ.ఆర్. హైస్కూలుకి ముందుగా తన ఇద్దరు కుమార్తెల సహకారంతో కార్పొరేట్ శోభని కల్పించారు. విద్యామంత్రి లోకేష్ చేతులమీదుగా ఆ బడిని తిరిగి తెరిపించారు. అదే తరహాలో మిగిలిన స్కూళ్ళలో కూడా పనులు మొదలు పెట్టించారు.



### వీ.ఆర్. హైస్కూల్ తరహాలో...
### మరో 15 పాఠశాలలు!

ఈ నేపథ్యంలో, తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని నిరూపించుకుంటూ, ఈనెల 16, 17 తేదీలలో ఆయన నెల్లూరులోని పలు స్కూళ్ళను సందర్శించారు. మూలాపేటలో ఉన్న ఎస్ఆర్ స్కూల్, జెండావీధి పిఎన్ఎం స్కూల్, సంతపేటలోని (గుంటబడి) ప్రాథమిక ఉన్నత పాఠశాల, రంగనాయకులపేటలోని పీఎంఆర్ స్కూల్, జాకీర్ హుస్సేన్‌నగర్‌లోని ఎంసిహెచ్ఎస్ స్కూల్ తదితర పాఠశాలలను పరిశీలించి వాటి అభివృద్ధి గురించి అధికారులతో చర్చించారు. విఆర్ హైస్కూల్ తరహాలోనే నగరంలోని మరో 15 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఆ హైస్కూళ్లను అభివృద్ధి చేయడం ద్వారా సుమారు 15వేల మంది పేదపిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందిస్తామని భరోసా ఇచ్చారు. వచ్చే విద్యాసంవత్సరానికల్లా అత్యున్నత ప్రమాణాలతో ఆ పాఠశాలలను సిద్ధం చేస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు.



### దాతలకు కృతజ్ఞతలు :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారంతో అధునాతన వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఇటీవలే విఆర్ హైస్కూల్‌కి సీఎస్ఆర్ ఫండ్స్ కింద కోటీ ఇరవై లక్షల విలువ చేసే 4 బస్సులను యూనియన్ బ్యాంకు అందచేసిందన్నారు. అదేవిధంగా, మూలాపేట స్కూల్‌ని డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సుధాకర్‌రెడ్డి దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారని, దాదాపు 40 వేల చదరపు అడుగుల్లో అద్భుతమైన భవన నిర్మాణాలు చేపట్టారని, ఇక్కడ నర్సరీ నుంచి పదో తరగతి వరకు పేద పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, జిగ్మా, టీవీఎస్, రెడ్డి లాబ్స్, ఏఎంఆర్ సంస్థల వారు నగరంలోని పలు పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు చేయూతనిస్తున్నారని అంటూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకొస్తున్న ఆ దాతలందరికీ మంత్రి నారాయణ ఈ సందర్భంగా అభినందన కృతజ్ఞతలు తెలిపారు.



# ఆలయాల పవిత్రతను పరిరక్షిస్తాం!

### • మంత్రి ఆనం రామనారాయణ

రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల ప్రక్షాళనకు, ప్రగతికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఆలయాల పవిత్రతను పరిక్షిస్తామని, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 18వ తేదీ నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నెల్లూరు జిల్లాలోని దేవాదాయశాఖ అధికారులు, ఇంజనీర్లు, స్తపతులతో మంత్రి సమావేశం నిర్వహించారు. తమ ప్రభుత్వం కేవలం ఈ 18నెలల పాలనలో 288 ఆలయాలకు రూ. 221 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. పాతవి, కొత్తవి అన్నీ కలిపితే సుమారు 498 ఆలయాల అభివృద్ధికి 603 కోట్ల రూపాయలను దేవాదాయశాఖ, దాతల సహకారంతో ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

### ఆలయాల్లో తప్పులు జరిగితే శిక్షలు తప్పవు

ఆలయాల్లో ఎవరు ఎటువంటి తప్పులు చేసినా శిక్షలు తప్పవని మంత్రి ఆనం స్పష్టం చేశారు. ఆగమశాస్త్ర విషయాల్లో కేవలం వేదపండితులు, ఆలయ అర్చకులకే పూర్తి నిర్ణయాధికారాలు ఉంటాయని, అధికారయంత్రాంగానికి స్థానం లేదని, కేవలం పరిపాలనాపరమైన అంశాల్లో మాత్రమే అధికారుల ప్రమేయం ఉండేలా చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో కల్తీ నెయ్యి, పరకామణి దోపిడీ విషయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, ఆలయాల్లో తప్పులు జరిగితే భగవంతుడు చూస్తూ ఊరుకోడని, అధికారులు-సిబ్బంది భయభక్తులతో ఆలయాల విధులు నిర్వహించాలని హితవు పలికారు.

### నెల్లూరు జిల్లాలో 58 ఆలయాల పునర్నిర్మాణం :

నెల్లూరు జిల్లాలో 58 ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని, జిల్లాలో సుమారు 118.45 కోట్లతో ఆలయాల అభివృద్ధికి కృషి జరుగుతోందని మంత్రి ఆనం చెప్పారు. సోమశిల సోమేశ్వరస్వామి, అమ్మవారి ఆలయాలు, నెల్లూరు వేణుగోపాలస్వామి, నవాబుపేట శివాలయం, ఇరుకళల అమ్మవారి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, ఉదయగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయం, నర్రవాడ వెంగమాంబ ఆలయం, బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతతో..

# రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

### • కొనియాడిన వేమిరెడ్డి దంపతులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనా దక్షతతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ వస్తోందని, కేవలం రెండు రోజుల్లోనే 613 ఒప్పందాలు, రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం గొప్ప విశేషమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ సమ్మిట్ విజయవంతం కావడంపై సోమవారం వారు నెల్లూరులోని తమ నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సీఐఐ సమ్మిట్ విజయవంతంతో దాదాపు 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వారు చెప్పారు. దేశంలోనే అత్యధికంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి రూ.13,25,716 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకోవడం హర్షదాయకమన్నారు. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబునాయుడి బ్రాండ్ ఇమేజ్, మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతరం జరిపిన సంప్రదింపులతో ఇది సాధ్యమైందన్నారు. సీఎం దూరదృష్టితో ఏపీ మళ్లీ దేశంలోనే నెంబర్ వన్ అవుతోందని చెప్పారు. ప్రభుత్వం తొలుత 8లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తే అంతకుమించి 13.25 లక్షల కోట్లు రావడం గొప్ప విషయమన్నారు. అలాగే జిల్లా స్థాయిలో 6,815 కోట్ల పెట్టుబడుల ద్వారా 4800 మందికి ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. జిల్లాలో జేఎం బాక్సీ గ్రూప్ సంస్థ 3 వేల కోట్లతో మెరైన్



సర్వీస్, లాజిస్టిక్, పోర్ట్ బేస్డ్ కంపెనీ ఏర్పాటు అవుతాయని చెప్పారు. వీటివల్ల సుమారు 3వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 2,200 కోట్లతో ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు కానుందని, దీంతో మరో 500 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఐటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆర్‌సీఆర్‌టీ 1615 కోట్లు పెట్టుబడులు పెట్టనుందని, దీని ద్వారా 1300 మంది ఉద్యోగాలు పొందుతారని వెల్లడించారు. త్వరలోనే గ్లాస్ తయారీ కంపెనీలు కూడా రాబోతున్నాయన్నారు.




## మంత్రి ఆనం చొరవతో.. త్వరలోనే

# ఆత్మకూరులో స్పోర్ట్స్ స్టేడియం

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఆత్మకూరులో త్వరలోనే స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు కానుంది. అందుకు అవసరమైన కోటి 80 లక్షల రూపాయల నిధులను ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఇటీవలే మంజూరు చేసింది. దీంతో ఆత్మకూరు యువతలో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి. ఈ విషయమై ఆదివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చర్చించారు. స్టేడియం ఏర్పాటుకు మాస్టర్‌ప్లాన్, అంచనాలు, టెండర్ల ప్రక్రియపై స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన స్టేడియం నిర్మాణపనులు చేపట్టాలని మంత్రి వారికి చెప్పారు.

## వెంకయ్యస్వామి ఆశ్రమంలో..

# ఏటా 10 లక్షల మందికి అన్నదానం

వెంకటాచలం మండలం గొలగమూడిలోని శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఏటా 10లక్షల మందికి అన్నదానం నిర్వహిస్తుండడం ఎంతో గొప్ప విషయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. కార్తీకమాసం సందర్భంగా సోమవారం గొలగమూడి ఆశ్రమంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత వెంకయ్యస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వెంకయ్యస్వామి ఆశ్రమం విశిష్టతను తెలిపారు. ఆశ్రమంలో ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అద్భుతంగా జరుగుతున్నాయని, కృత్రిమ అవయవాలు తయారు చేసి దివ్యాంగులకు చేయూతనిస్తున్నారని, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్ ప్రతి నెలా గొలగమూడికి వచ్చి పేదలకు వైద్యసేవలందిస్తున్నారని ఆయన చెప్పారు. టీటీడీ జేఈఓగా సుదీర్ఘకాలం సేవలందించిన పి.బాలసుబ్రహ్మణ్యం గొలగమూడి ఇఓగా ఉంటూ ఆశ్రమాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని, ఒక్క రూపాయి కూడా జీతం తీసుకోకుండా వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఆయన సేవలందిస్తుండడం, ఆశ్రమాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తుండడం విశేషమని తెలిపారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశీస్సులు రాష్ట్రానికి, ప్రజలందరికీ ఉండాలని కోరు కుంటున్నానని ఆయన అన్నారు.

## అస్తవ్యస్థంగా...

# కండలేరు డ్యామ్ నిర్వహణ

**- 'నమామి గంగే' కన్వీనర్ మిడతల రమేష్ విమర్శ -**



తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన కండలేరు జలాశయం మట్టికట్ట అడవిని తలపిస్తోందని, డ్యామ్ నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆరోపించారు. కండలేరు డ్యామ్ మట్టికట్టను సోమవారం ఆయన పొదలకూరు మండల బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్యామ్ నిర్వహణ పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కండలేరు మట్టికట్ట నిర్మాణం జరిగి సుమారు 30ఏళ్ళు అవుతోందని, ఈ మట్టి కట్టను వెడల్పు చేసి పటిష్టపరచమని నిపుణుల కమిటీ సూచించినా, ఆ దిశగా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. మట్టికట్టపై చెట్లు పెరిగి ఉన్నాయని, అవి మట్టికట్టను బలహీన పరుస్తున్నాయని, ఇప్పటికే ఆ కట్ట ఒక అడుగు మేర ఎత్తు తగ్గి భూమిలోకి కూరుకుపోయిందని చెప్పారు. కండలేరు డ్యామ్‌ను కట్టుదిట్టం చేసేందుకు ఇకనైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పొదలకూరు మండల బీజేపీ అధ్యక్షులు పూల ప్రశాంత్, బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రమణ్యం, రాచపూటి ధనుంజయరావు, నరాల సుబ్బారెడ్డి, అక్కెం జనార్ధన్‌రెడ్డి, దబ్బుగుంట అంకయ్య పాల్గొన్నారు.

# షేక్ హసీనా పై కక్ష సాధింపు!

మనసులో మాట 72

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్' (ICT) తాజాగా మరణశిక్ష విధిస్తూ తీర్పునివ్వడం దక్షిణాసియా రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. 2024 జులై-ఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమం, తదనంతర హింసాకాండకు బాధ్యురాలిగా ఆమెను దోషిగా తేల్చారు. అయితే, ఈ తీర్పు కేవలం న్యాయపరమైన చర్యేనా లేక దీని వెనుక అంతర్జాతీయ కుట్రలు, మత ఛాందసవాద శక్తుల అజెండా ఉందా అనేది చర్చనీయాంశంగా ఉంది.

2024 ఆగస్టులో విద్యార్థుల రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం హింసాత్మకంగా మారి, షేక్ హసీనా అధికారిక నివాసం పై దాడికి కొన్ని శక్తులు సిద్ధం కావడంతో ఆమె కట్టుబట్టలతో దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. అప్పటినుండి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతూ.. సురక్షిత ప్రదేశంలో ఉంటున్నారు. ఇటీవల నుంచే ఆమె తమ గళం వినిపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. తాజా తీర్పుపై ఆమె స్పందిస్తూ అది ఏకపక్ష తీర్పు అని దుయ్యబట్టారు. బంగ్లాదేశ్‌కు త్వరలోనే మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నాయకులపై వరుస కేసులు బనాయించింది. ఇప్పుడు 2025 నవంబర్‌లో వచ్చిన ఈ మరణశిక్ష తీర్పు ఆ రాజకీయ ప్రతీకార చర్యల్లో పరాకాష్టగా కనిపిస్తోంది.

హసీనా పతనం వెనుక కేవలం అంతర్గత వ్యతిరేకతే కాదు, బలమైన విదేశీ హస్తం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ ప్రభుత్వం భారత్‌కు అనుకూలంగా ఉండటం పాకిస్తాన్‌కు ఎప్పుడూ మింగుడుపడని విషయం. విద్యార్థి ఉద్యమంలోకి 'జమాత్-ఎ-ఇస్లామీ' వంటి రాడికల్ గ్రూపులను చొప్పించి, అశాంతిని రాజేయడంలో పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ కీలక పాత్ర పోషించిందనే ఆరోపణలు ఉన్నాయి. చైనా "తీస్తా నది" ప్రాజెక్టుతో సహా అనేక విషయాల్లో హసీనా ప్రభుత్వంపై పట్టు సాధించడానికి ప్రయత్నించింది. కానీ హసీనా భారత్ వైపు మొగ్గు చూపడం చైనాకు నచ్చలేదు. హసీనా పతనం తర్వాత కొత్త ప్రభుత్వంతో చైనా సత్సంబంధాలు పెంచుకుంటూ, భారత్ చుట్టూ ఉచ్చును బిగించాలని అనుకుంటోంది. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో అమెరికా హసీనా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. సెయింట్ మార్టిన్ దీవిని అమెరికాకు అప్పగించడానికి హసీనా నిరాకరించడం వల్లే ఆమెను గద్దె దించారనే ప్రచారం బలంగా ఉంది. పశ్చిమ దేశాలు ఇప్పుడు యూనస్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ, పరోక్షంగా ఆ ప్రాంతంలో తమ ఆధిపత్యాన్ని కోరుకుంటున్నాయి.

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో లౌకికవాదం ప్రమాదంలో పడింది. జమాత్-ఎ-ఇస్లామీ', 'హెఫాజత్-ఎ-ఇస్లామ్' వంటి ఛాందసవాద సంస్థలను హసీనా హయాంలో తొక్కి పెట్టగా ఇప్పుడు అవి ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్నాయి. హిందువులపైన, వారి ఆలయాలపైన దాడులు పెరిగాయి.

హసీనాకు మరణశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు వెనుక న్యాయం కంటే, అవామీ లీగ్‌ను రాజకీయంగా అంతం చేసి, బంగ్లాదేశ్‌ను ఒక ఇస్లామిక్ దేశంగా మార్చాలనే మౌలికవాదుల అజెండా స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రస్తుతానికి బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పరిస్థితి దయనీయంగా ఉంది. పలువురు కార్యకర్తలను జైళ్లకు పంపించారు. పలువురు అజ్ఞాతంలోకి వెళ్ళారు. సామాన్య ప్రజల్లో ఆమె పట్ల సానుభూతి ఉన్నప్పటికీ, బహిరంగంగా మద్దతు తెలిపే ధైర్యం ఎవరికీ లేదు. కానీ, కొత్త ప్రభుత్వం నిత్యావసర ధరలను నియంత్రించలేకపోవడం, శాంతిభద్రతల సమస్యల వల్ల ప్రజల్లో అసహనం మొదలైంది. ఇది భవిష్యత్తులో హసీనాకు లేదా ఆమె వారసులకు సానుకూలంగా మారే అవకాశం లేకపోలేదు.

ఈ తీర్పు ఏకపక్షంగా ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ట్రైబ్యునల్ న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్లు అందరూ ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ నియమితులే. హసీనాకు తన వాదన వినిపించుకునే అవకాశం సరిగా ఇవ్వలేదు. ఇది న్యాయ విచారణ కంటే రాజకీయ కక్ష తీర్చుకునే చర్యలాగా ఉందని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు.

హసీనాకు ఆశ్రయం కల్పించిన భారత్ ఇప్పుడు ఏం చేయబోతోంది అన్నది ఆసక్తి కలిగిస్తోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించాలని కోరుతోంది. కానీ, రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందంలో రాజకీయ కారణాలతో కూడిన నేరాలకు మినహాయింపు ఉంది. భారత్ ఈ నిబంధనను చూపించి ఆమెను అప్పగించడానికి నిరాకరించవచ్చు. ప్రస్తుతానికి భారత్ ఈ తీర్పుపై ఆచితూచి స్పందిస్తోంది. బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ ఛాందసవాద శక్తుల పెరుగుదల భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల భద్రతకు (Chikens Neck Corridor) ముప్పు. కాబట్టి, అక్కడి ప్రభుత్వంతో సంబంధాలను కొనసాగిస్తూనే, తన ప్రయోజనాలను కాపాడుకోవడం భారత్ తక్షణ కర్తవ్యం.

షేక్ హసీనాకు మరణశిక్ష అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదు. ఇది బంగ్లాదేశ్ భవిష్యత్తు దిశను మార్చే పరిణామం. అక్కడ ప్రజాస్వామ్యం పేరుతో మతతత్వం రాజ్యమేలితే, అది భారత్‌కే కాదు, దక్షిణాసియా శాంతికే ప్రమాదం. భారత్ ఈ క్లిష్ట సమయంలో దౌత్యపరంగా చాకచక్యంగా వ్యవహరించాలి.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నాందోళన

సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 18న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన ఈ పదకొండేళ్ళలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని విమర్శించారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతోందని, రాజ్యాంగం కల్పించిన మానవహక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి పాతర వేస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఆర్‌ఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో సీపీఐ నాయకులు ఎన్.రమణయ్య, కార్యవర్గ సభ్యులు పి.మాలకొండయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మున్నా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్, ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు పి.జిలానిఖాన్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ వినోదమ్మ, వివిధ విభాగాల నాయకులతో పాటు రూరల్ మండల నాయకులు పాల్గొన్నారు.

## కావలిలో నిరసనలు

దేశంలో దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయంటూ కావలి పట్టణంలోని సీపీఐ నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 18న ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆ సమితి రాష్ట్ర సభ్యులు దామా అంకయ్య ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రధాని నరేంద్రమోడీ పాలనలో బడుగు బలహీనవర్గాల వారిపై దాడులు పెరిగిపోతుండడం దారుణమంటూ విమర్శించారు. జనగణనతో పాటు కులగణన కూడా చేసి, బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయింపులో ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. సీపీఐలోని పలు విభాగాల నాయకులతో పాటు దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి, సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు, జిల్లా నాయకులు సిరాజ్, షానవాజ్, జిల్లా సమితి సభ్యులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన బాటలో మునిసిపల్ కార్మికులు

దీర్ఘకాలంగా ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదంటూ నెల్లూరులో మునిసిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ఈనెల 18న నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు మాట్లాడుతూ, గత 15 రోజులుగా తమ సమస్యల సాధన కోసం ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా మోకాళ్లపై నిలబడి కార్మికులు ఆందోళన కొనసాగించారు. మరణించిన కార్మికుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలని, సమ్మెకాలంలో ఇస్తామన్న జీతం ఇప్పించాలని తదితర కోర్కెల సాధన కోసం ఆందోళన చేపట్టామన్నారు. సీఐటియు రూరల్ అధ్యక్షుడు సుధాకర్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, ఆర్ఎం సునీల్, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సుజాతమ్మ, దేశమూర్తి, నాయకులు కోటేశ్వరరావు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాధికారుల సమస్యలు తీర్చాలి

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల (సీహెచ్ఓ) సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ ఎంసీపీ జిల్లా నాయకులు కోరుతున్నారు. ఈనెల 18న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాతను కలసి ఆమేరకు వారు వినతిపత్రం సమర్పించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులకు ఫిక్స్‌డ్ పే ఉండాలని వారు కోరారు. భవన అద్దె, విద్యుత్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. ఏపీ ఏఎంసీ జిల్లా శాఖ అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి రబేకా, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిధులు కరువు.. విధులు బరువు

## పేలవంగా గ్రంథాలయాల వారోత్సవాల దరువు

జిల్లాలో గ్రంథాలయాల నిర్వహణకు ఎంతోకాలంగా నిధులు లేవు. ఎప్పటికప్పుడు స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్ బకాయిల కోసం ఎదురు చూడడమేతప్ప, ఆ బకాయిలు వచ్చింది లేదు..గ్రంథాలయాల అభివృద్ధి జరిగింది లేదు. ఏళ్ళ తరబడిగా ఈ దుస్థితి కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని ప్రధాన కేంద్ర గ్రంథాలయానికి సైతం నూతన భవన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ఆ నిర్మాణానికి నిధులు లేకపోవడంతో అది కూడా ఆదిలోనే ఆగిపోయింది. అంతేకాదు, జిల్లాలోని అనేక శాఖా గ్రంథాలయాలు కాలక్రమేణా మరమ్మతులకు నోచుకోక, శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అమూల్యమైన గ్రంథాలెన్నో చెదలుపట్టిపోతున్నాయి. వాటిని భద్రపరిచే పరిస్థితే ఉండడం లేదు. బైండింగ్ చేయించడం, అవసరమైన వాటిని కంప్యూటర్ స్కానింగ్ చేసి కాపాడుకోవడం వంటి కార్యక్రమాలు జరగడం లేదు. కారణం.. నిధుల కరువే! పాఠకులకు అవసరమైన సమాచారాన్ని జెరాక్స్ తీసిచ్చే వెసులుబాటు కూడా లేదు. కొత్త పుస్తకాలు తెప్పించుకునేందుకు కూడా నిధులు లేకపోవడంతో ఏం చేయాలో తోచక గ్రంథాలయ ఉద్యోగులు అయోమయంలో విధులు వెళ్ళదీస్తున్నారు.

పార్టీలు మారినప్పుడల్లా.. ఆయా పార్టీలు తమ పార్టీలకు చెందిన రాజకీయ నిరుద్యోగులకు గ్రంథాలయ ఛైర్మన్ పదవులు కట్టబెడుతున్నారే తప్ప.. వారికి కనీస అర్హతలు ఉన్నాయో? లేదో? కూడా చూడడం లేదు. అలాంటి ఛైర్మన్ల అవగాహనా రాహిత్యంతో గ్రంథాలయాలు అధోగతిపాలయ్యాయి. ఏదేమైనా, అటు నిధుల కరువుతో గ్రంథాలయాలు, ఇటు విధుల బరువుతో వాటి సిబ్బంది ఊగిసలాడుతున్న సమయంలో.. గ్రంథాలయాల వారోత్సవాలు వచ్చాయి. జిల్లా అధికారులు, గ్రంథాలయ సిబ్బంది మొక్కుబడి తంతుగా వారోత్సవాలను మమ అనిపించారు.

### గ్రంథాలయాలంటే విజ్ఞాన బాండాగారాలు :

గ్రంథాలయాలంటే విజ్ఞాన బాండాగారాలని, పుస్తకప్రియులకు అపారమైన విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలెంతగానో ఉపకరిస్తాయని వారోత్సవాల్లో పాల్గొన్న వక్తలు చెప్పారు. నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నవంబరు 14న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు జరిగాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఈ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే గ్రంథాలయాలకు చేరువైతే ఉన్నత విద్యతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో నెగ్గి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజా, కవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కావలి కాలువకు సోమశిల నీళ్ళు

## ○ రైతుల్లో ఆనందపు పరవళ్ళు!



రెండో విడతగా వేస్తున్న రబీ పంటలకు సోమశిల జలాలు రావడంతో ఉదయగిరి, కావలి ప్రాంత రైతాంగంలో ఆనందం వెల్లువెత్తుతోంది. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కేశవచౌదరి తదితరులు ఈనెల 18న మండల కేంద్రమైన సంగం వద్ద కావలి కాలువకు సోమశిల జలాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తూ.. అన్ని ప్రాజెక్టులు, చెరువులలో పుష్కలంగా నీరు నిండిపోతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు రెండవ కారు పంటకు నీరు విడుదల చేయడం రైతులకు హర్షదాయకమని, ఇది వ్యవసాయ రంగ పునరుజ్జీవనానికి కీలకమైన నిర్ణయమని అన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా సోమశిల జలాలను ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు కూడా ఉపయోగపడేవిధంగా కృషిచేస్తామని చెప్పారు.

# ఘనంగా..'జన్ జాతీయ గౌరవ దివస్'




బుచ్చిరెడ్డిపాళెంలోని కృష్ణచైతన్య కళాశాలలో ఇటీవల 'జన్ జాతీయ గౌరవ దివస్' జరిగింది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమానికి ప్రాణం పోసిన గిరిజన నాయకుడు బిర్సా ముండా అని, చిన్నవయస్సులోనే బ్రిటీష్ వారి అణచివేతకు వ్యతిరేకంగా ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం అపూర్వమైనదన్నారు. అద్భుతమైన ఆయన ధైర్యసాహసాలు, నాయకత్వం, దేశభక్తి అందరికీ ప్రేరణ కావాలన్నారు. ఆ మహనీయుని ఆశయాలు స్ఫూర్తిదాయకమని, ఆ మహానాయకుడి జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం జన్ జాతీయ గౌరవ దివస్‌ను ప్రకటించడం గొప్పవిషయమని అన్నారు. తొలుత, కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# కాలేషా జీవితం.. పేదలకి అంకితం



పేదల సమస్యల పరిష్కారానికి కాలేషా కృషి చేశారని, ఆయన జీవితాన్ని పేదలకి అంకితం చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈ నెల 16న కాలేషా సంతాప సభ నిర్వహించారు. పార్టీలో 40 ఏళ్ళు పనిచేశారని, గూడూరును నెల్లూరుజిల్లాలో కలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేశారన్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించేందుకు పోరాటం చేశారన్నారు. గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్, సీపీఐ నాయకులు ప్రభాకర్, చంద్రయ్య, గోపాల్, శివకుమార్, రామరాజు, కుమార్, వైకాపా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి కాలేషా సంతాప సభలో పాల్గొని ప్రసంగించారు. తెలుగుదేశం నాయకులు కూడా సంతాపం తెలిపారు.

# విశ్వం వరల్డ్ రికార్డ్ అందుకున్న శ్యామ్‌యాదవ్



గూడూరు పట్టణంలోని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) అరుదైన రికార్డ్ సాధించడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ చేసినటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి "విశ్వం వరల్డ్ రికార్డ్" అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ తనకి ఈ అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇదేవిధంగా విద్యా, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి 5 కోట్లు

## • తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి




గూడూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.5కోట్ల తుడా నిధులు మంజూరు చేస్తామని తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో రూ.70లక్షలతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను ఆయన ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌తో కలిసి ఈనెల 16వ తేదీ ప్రారంభించారు. గూడూరు చెరువుకట్టను పరిశీలించారు. అనంతరం, నెల్లటూరులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధికి రూ.కోటి, మున్సిపాలిటీల అభివృద్ధికి 4కోట్ల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. తుడా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్‌దీపాల పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్‌కి ఎమ్మెల్యే పాశం కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో మధుసూదనరావు, నాయకులు కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, శీలావతి, వెంకటేశ్వర్లురాజు, శ్రావణి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



# గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కమిటీ


తిరుపతి జిల్లా ఏ.పి నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ఛైర్మన్ ఎస్.సురేష్‌బాబు ఆదేశాల మేరకు ఏ.పి. నాన్‌గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ల గూడూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నవంబర్ 14న గూడూరు ఎన్జీవో భవనంలో అడహాక్ కమిటీ ఎలక్షన్ ఆఫీసర్ వి.వి.శ్రావణ్‌కుమార్, బి.నారాయణ, డి.ఫణీంద్రకుమార్‌ల ఆధ్వర్యంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా యస్.వి.శ్రావణ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా ఓ.తనూజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.శంకరరాజు, కోశాధికారిగా ఎస్.కె.ఖాదర్‌బాషా, ఉమెన్స్ విభాగం ఉపాధ్యక్షులుగా ఆర్.సరోజనమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వి.దేవప్రసన్నకుమార్, సి.హెచ్.రవికుమార్, జి.సతీష్, మొహమ్మద్‌ను, మల్లికార్జున ఉపాధ్యక్షులుగా, ఎం.రఘు, వి.కిరణ్‌కుమార్, టి.సుబ్రహ్మణ్యం, సిహెచ్ ఉదయ్‌కుమార్, ఏ.జ్యోతిర్మయి, ఏ.లక్ష్మమ్మలను జాయింట్ సెక్రటరీలుగా 16 మంది సభ్యులతో కూడిన నూతన ప్యానల్‌ను ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులు యస్.వి.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# దివ్యాంగులకు జేవీవీ వితరణ



గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 16న జేవీవీ ఉపాధ్యక్షులు చెంచునారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు, వేరుశనగ ముద్దలు పంపిణీ చేశారు. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, జగదీష్, సుమన్‌రెడ్డి, సురేష్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, సుబ్రహ్మణ్యం, అశోక్, ఆనంద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వైభవం...!




దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంకి ఇష్టమైన గాయకుడు, 'నెల్లూరు ప్రవీణ్'గా పేరుగడించిన **కొప్పోలు ప్రవీణ్‌కుమార్ - సాత్విక రమ్యల** ల పెళ్ళి నవంబర్ 13వతేదీ ప్రకాశం జిల్లా అద్దంకిలో జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

# మాది రైతు ప్రభుత్వం

### ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్




తమది రైతు ప్రభుత్వమని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు. ఈనెల 19న ఆయన కలిగిరి మండలం వెలగపాడు పంచాయతీలో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ రెండు విడతల్లో కలిపి ఉదయగిరి నియోజకవర్గంలోని 45,275 మంది రైతుల ఖాతాల్లో రూ. 30.18 కోట్లు జమచేయడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడి మార్గదర్శకత్వంలో, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల పంట సాగుకు, వ్యవసాయ ఖర్చులకు ఆర్థిక చేయూతనందించడం జరుగుతోందన్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులను కూడా తమ ప్రభుత్వం విస్తృతంగా పంపిణీ చేసిందని, ఉదయగిరి నియోజకవర్గ రైతులకు మొత్తం 976 క్వింటాళ్ల విత్తనాలు, 1161 మెట్రిక్ టన్నుల ఎరువులు అందజేయడం జరిగిందని చెప్పారు. రైతుల అవసరాలన్నింటికీ అండగా నిలబడి, పంట ఉత్పత్తి నుండి ఆదాయ భద్రత వరకు ప్రతిదశలో రైతులకు సహాయం చేస్తూ, నిజమైన రైతు ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుండడం హర్షదాయకమన్నారు.

### ఏవీఎస్ఓ సతీష్ మృతిపై..
## సీబీఐ దర్యాప్తు జరపాలి

### శాలివాహన సంఘం నేతల ధర్నా



తిరుమల తిరుపతి దేవస్థానాల పరకామణి కేసులో, అప్పట్లో అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్ఓ)గా పనిచేసిన సతీష్‌కుమార్ మరణంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ కుమ్మర శాలివాహన సంక్షేమసంఘం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 19న వారు ధర్నాందోళన నిర్వహించారు. సంఘం నేతలు మాట్లాడుతూ, ఏవీఎస్ఓ సతీష్‌కుమార్ మృతిపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరపాలని కోరారు. మృతుని కుటుంబసభ్యులను ప్రభుత్వ ప్రతినిధులెవరూ పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. నాయకులు సమాధి శ్రీనివాస యాదవ్, విరపు లలితారాంయాదవ్, ఎస్ఎస్‌యాదవ్, బుధవారపు బాలాజీ, సోమా గోపాల్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్ఓకి వినతిపత్రం సమర్పించారు.



## రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు!

రక్తదానమంటే ప్రాణదానమేనని, రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది దాసరి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. తన జన్మదినం సందర్భంగా ఈనెల 19న ఆయన 55వ సారి నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం.. అన్నిదానాల్లోకెల్లా విశిష్టమైదన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు వద్దని, ఆరోగ్యకరమైన వ్యక్తి సంవత్సరానికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని, అందువల్ల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛంధంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం వల్ల ఆసుపత్రుల్లో రక్తం కొరతను తీర్చవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్ స్టాటిస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ ఉదయ్‌భాస్కర్, ఫిజియోథెరపీ నిపుణులు కూడా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ వైస్ ఛైర్మెన్ చమర్తి జనార్ధన్‌రాజు, ప్రతినిధులు బయ్యా ప్రసాద్, సురేష్ జైన్ పాల్గొన్నారు.

# సహకార బ్యాంకులు.. రైతులకు అండగా ఉండాలి




ఎరువులు, విత్తనాల సరఫరాతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకార బ్యాంకులు చొరవ చూపి, సహకార బ్యాంకులంటే రైతుల బ్యాంకులుగా పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. ఈనెల 19న ఆమె బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో నిర్వహించిన 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సహకార రంగంలో రాష్టంలో బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు సహకార బ్యాంక్‌కు విశిష్ట స్థానం వుందని ప్రశంసించారు. దాదాపు 6,500 మంది సభ్యులకు సంబంధించిన 1 కోటి 88 లక్షల 67 వేల రూపాయల షేర్ క్యాపిటల్‌తో నిర్వహించే వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ 145 కోట్ల 27 లక్షల టర్నోవర్ సాధించడం అభినందనీయమన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 2 కోట్ల 85 లక్షల నికర ఆదాయం ఆర్జించడం వెనుక వవ్వేరు సహకార బ్యాంక్ సిబ్బంది మరియు సభ్యుల కృషి వుందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిషత్తులో వవ్వేరు సహకార బ్యాంక్ మరింత అభివృద్ధి సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని, గ్రామ స్థాయిలో నాయకులు సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 19న బుచ్చిరెడ్డి పాళెం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బుచ్చి పరిధిలో తొలి విడతగా 285మంది లబ్దిదారులకు ఈనెల 25న ఇళ్ళు కట్టించి ఇస్తామని, పక్కా ఇళ్ళు, ఇంటి స్థలాల కేటాయింపులో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. ఎంపికలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని ఆమె అధికారులను హెచ్చరించారు.

## బుచ్చిలో అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన

బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఈనెల 19న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అగ్నిమాపక కేంద్రం బుచ్చిలో ఏర్పాటవుతుండడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణానికి 2 కోట్ల 50 లక్షలను మంజూరుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రశాంతమ్మ ధన్యవాదాలు తెలిపారు. ఇటీవలే గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయిన బుచ్చి పట్టణానికి పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చేందుకు కృషిచేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# ఇందిరమ్మ 108వ జయంతి



మాజీ ప్రధాని, దివంగత మహానేత ఇందిరా గాంధీ 108వ జయంతిని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కూడలి వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ప్రధాని,ఉక్కు మహిళగా, ధైర్యసాహసాలు కల నేతగా, పేదల పాలిట పెన్నిధిగా ఇందిరాగాంధీ గొప్ప ఖ్యాతిని పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, వేటూరి శ్రీనివాసులరెడ్డి, మోహన్‌రెడ్డి, సంజయ్‌కుమార్, సుధీర్, గణేష్, ఇర్ఫాన్, మల్లికార్జునరెడ్డి, ధనుంజయ్, బద్రి తదితరులు పాల్గొన్నారు

### రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు
## ఎల్ఏపి విద్యార్థులు



ఇటీవల నెల్లూరు, ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో రాణించిన గూడూరు, 'లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్' విద్యార్థులు బి.నోవక్ ఆకాష్, యు.లితేష్, కే.సూర్యతేజ, భువనేష్ మీనలు ఎంపికయ్యారు. ఈ నలుగురు విద్యార్థులు ఈ నెల 22, 23, 24 తేదీలలో తిరుపతి జిల్లా, చంద్రగిరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ఐ అండర్-14 బాలుర కేటగిరి హాకీలో ఆడనున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు, వీరికి శిక్షణ నిచ్చిన పిఇటి వి.కృష్ణయ్యకి లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## బాలల సంక్షేమానికి కృషి

- ఐసీడీఎస్ డైరెక్టర్ హేనా సుజన్




బాలల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబరు 14న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె బాలల దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, వారికి మంచి విద్య, పోషణ, రక్షణ, మానసిక ఆరోగ్యం వంటి అన్ని అంశాల్లో సమగ్ర సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. డీఎంఅండ్‌హెచ్ఓ సుజాత, కార్మిక శాఖ అధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుని చేతుల మీదుగా..

# డా. గంగిశెట్టికి 'బాలసాహిత్య పురస్కారం'



నెల్లూరుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్ నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్‌కౌశిక్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డుతో పాటు 50వేల రూపాయల నగదు బహుమతిని, తామ్రపత్రాన్ని అందించి ఆయన్ను ఘనంగా సన్మానించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారు కొద్దిరోజుల క్రితం బాలసాహిత్యంలో ఈ అవార్డును డా. గంగిశెట్టికి ప్రదానం చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన రచించిన 'కబుర్ల దేవత' బాలల కథా సంకలనం 2025 సంవత్సరానికి బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైంది. బాలల్లో మానవతా విలువలు, శాస్త్రీయ దృక్పథం పెంపొందించే విధంగా ఆయన ఆ కథలను రచించారు. ఈ సంకలనంలో 36 కథలుంటాయి. విజ్ఞానంతోపాటు వినోదాత్మకంగా ఉండే ఆ కథలు బాలలను బాగా ఆకట్టుకుంటాయి.

డా. గంగిశెట్టి శివకుమార్ స్వస్థలం నెల్లూరుజిల్లా రాపూరు. ఎం.ఏ, ఎంఇడి, పీహెచ్‌డీ పూర్తిచేసిన ఆయన, తెలుగుభాష మీద మక్కువతో బాలల కథలెన్నో రాశారు. గత 50ఏళ్లుగా ఆయన బాలసాహితీరంగంలో ఉంటూ వందలాది బాలల కథలను రచించారు. నేటికీ రచిస్తూనే ఉన్నారు. గతంలో ఆయన 'చందమామ' పత్రికలో ఉప సంపాదకునిగా కూడా పనిచేశారు. బాలల కథలపై పరిశోధన చేసి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డా. గంగిశెట్టికి ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించడంతో ఆయన్ను జిల్లాలోని సాహిత్యాభిమానులు, సాహిత్య సంఘాల వారు అభినందిస్తున్నారు.

# రాజకీయ వ్యయాల్ని ఒకేచోట ప్రకటించాలి


న్యాయవాది దశరథరామిరెడ్డి



రాజకీయ ప్రతినిధులపై జరుగుతున్న ప్రభుత్వ వ్యయాలను పూర్తిగా ఏకీభవించి ప్రజలకు వెల్లడించేందుకు 'పొలిటికల్ డిపార్ట్‌మెంట్' (రాజకీయ విభాగం)ని ఏర్పాటుచేయాలని ఏసీబీ కోర్టు మాజీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది వై.దశరథరామిరెడ్డి ఇటీవల విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేశారు. రాజకీయ ప్రతినిధులపై ప్రజా నిధులతో జరిగే మొత్తం ప్రభుత్వ ఖర్చును ఏకీకృతంగా ఒకేచోట ప్రకటించే విధంగా రాష్ట్ర మరియు కేంద్ర బడ్జెట్‌లలో ప్రత్యేక పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం ఆ విషయంలో ఉన్న లోపాలను ఆయన వివరిస్తూ, రాజకీయ నాయకులపై అయ్యే ఖర్చులు వేర్వేరు శాఖల్లో చెల్లా చెదురుగా ఉండడంతో మొత్తం రాజకీయ పరిపాలనా వ్యయం ఎంత అన్నది ప్రజలకు లేదా ఆడిట్ సంస్థలకు కూడా స్పష్టంగా తెలియడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఖర్చులు మాత్రం బహిరంగంగా ప్రకటిస్తారు కానీ రాజకీయ నాయకుల ఖర్చుల విషయంలో పారదర్శకత లోపిస్తోందని, ఇది ఆర్టికల్ 14 (సమానత్వం) మరియు ఆర్టికల్ 19(1)(ఏ) -(తెలుసుకునే హక్కు) సూత్రాలకు విరుద్ధమని ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదన ఎవరికీ వ్యతిరేకం కాదని, ప్రజాస్వామ్యాన్ని మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చడమే లక్ష్యంగా ఆమేరకు సూచిస్తున్నామని పేర్కొన్నారు.

# ఆదివాసుల జీవితాల్లో వెలుగుదివ్వె.. వెన్నెలకంటి రాఘవయ్య

***దేశభక్తుడు.. స్వాతంత్ర్య సమరయోధుడు.. సంఘ సేవకుడు.. ప్రముఖ న్యాయవాది.. రాజకీయవేత్త.. వీటన్నింటికిమించి ఆదివాసుల బ్రతుకుల్లో వెలుగులు నింపిన పోరాటయోధుడు.. ఇవన్నీ ఒక్కరే! ఆయనే మన సింహపురి ముద్దుబిడ్డ వెన్నెలకంటి రాఘవయ్య. ఈయనకే 'నెల్లూరు గాంధీ' అని కూడా పేరు.***



వెన్నెలకంటి రాఘవయ్య శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా శింగపేట గ్రామంలో 1897 జూన్ 4వ తేదీన వెన్నెలకంటి పాపయ్య – సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఐదవ ఏట తల్లి మరణించడంతో అక్క సంరక్షణలో పెరిగారు. ప్రాథమిక విద్యాభ్యాసం శింగపేట, అల్లూరులలో, హైస్కూల్ విద్య నెల్లూరులోని వెంకటగిరి రాజా ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. మద్రాసు పచ్చయప్ప కళాశాలలో బి.ఏ చదివారు. అనంతరం న్యాయవిద్యను పూర్తిచేసి బి.ఎల్ పట్టా పొంది న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాంగ్రెస్‌కి నెల్లూరుజిల్లా తొలి కార్యదర్శి పొణకా కనకమ్మ, బాలసరస్వతమ్మ, వేమూరి లక్ష్మయ్య, చతుర్వేదుల వెంకటకృష్ణయ్య తదితరులతో కలిసి 'స్వరాజ్య సంఘం' స్థాపించారు. వెంకటగిరి రాజాకు, రైతులకు మధ్య కొనసాగిన వివాదాల్లో ఆచార్య ఎన్.జి రంగాతో కలిసి రైతులపక్షాన పోరాడారు. అలాగే స్వరాజ్యోద్యమంలో ప్రకాశం పంతులు గారితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పెన్నార్ – కృష్ణ ప్రాజెక్టు కోసం ఆందోళనలు నిర్వహించారు. అంతే కాకుండా... "ఆది-ఆంధ్ర-ఉద్ధరణ సంఘం" ఏర్పాటు చేసి, ఆ సంఘం పక్షాన హరిజన బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్ళు ఏర్పాటు చేశారు.

కీర్తిమూర్తులు

1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులుకు పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేశారు. ఓవైపు స్వాతంత్రోద్యమంలో ఉత్సాహంగా పాల్గొంటూనే, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అనేక పోరాటాలను చేసిన రాఘవయ్యను ఈ ప్రాంతవాసులు 'నెల్లూరు గాంధీ'గా కీర్తించారు.

**గిరిజనులు, సంచార జాతుల హక్కుల కోసం పోరాటం :**

వెన్నెలకంటి రాఘవయ్య యానాదులు, ఎరుకల వారు, లంబాడీలు, చెంచులు, బుడబుక్కలవారు, ఇతర సంచార జాతులను సంఘటితం చేసి వారిలో చైతన్యం తీసుకువచ్చారు. థక్కర్ బాలాతో కలిసి గిరిజనుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారు. వారికి కాలనీలు ఏర్పాటు చేయడంతో పాటు వారి సమస్యలపై పలు పుస్తకాలు రచించారు. అప్పట్లో బ్రిటీష్‌వారు క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ పేరిట యానాదులను దొంగలుగా ముద్రవేసి తీవ్రమైన వేధింపులకు గురిచేసేవారు. రాఘవయ్య ఆ కేసులను వాదించడంతో పాటు ఉద్యమాలు జరిపి క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్‌ను రద్దు చేయించారు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో "స్టేట్ ట్రైబల్ ఎంక్వైరీ కమిటీ"కి అధ్యక్షులై రాష్ట్రమంతా పర్యటించి ఆదివాసీల జీవన సరళిని క్షుణ్ణంగా అధ్యయనం చేయడంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేశారు. బాలికలను విక్రయించే, పనిమనుషులుగా మార్చే విధానాన్ని గిరిజనులు తిరస్కరించేలా వారిలో చైతన్యం తీసుకువచ్చారు. ఆదివాసీల జీవన విధానం, సమస్యలపై తెలుగు, ఆంగ్ల భాషల్లో 30కిపైగా గ్రంథాలు రచించారు. చెంచుల జీవనంపై తెలుగులో 'అడవిపూలు', 'మరియులు' అనే గ్రంథాలు రాశారు. అలాగే ఆంగ్లంలో 'ట్రైబ్స్ ఆఫ్ ఇండియా', 'ట్రైబల్ రివోల్ట్', 'ట్రైబల్ జస్టిస్', యానాది (తెలుగు, ఆంగ్లం) తదితర గ్రంథాలు రాశారు.

**వెన్నెలకంటి సేవలకు 'పద్మభూషణ్' :**

వెన్నెలకంటి రాఘవయ్య చేసిన సామాజిక సేవలను గుర్తించిన అప్పటి భారత ప్రభుత్వం ఆయనను 1973లో 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. జీవితమంతా సామాజిక సేవ, ఉద్యమాలు, పోరాటాలతో గడిపిన రాఘవయ్య, 1981 నవంబర్ 24వ తేదీన ఈ లోకాన్ని విడిచిపెట్టారు. ఆ మహనీయుని కృషికి గుర్తింపుగా నెల్లూరు నగరంలో గిరిజనులకు సంబంధించిన భవనానికి 'వెన్నెలకంటి రాఘవయ్య భవన్'గా పేరు పెట్టారు.



**(నవంబర్ 24, వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతి సందర్భంగా...)**

**- డా॥ కనియంపాటి రామకృష్ణ**
**సెల్. 96189 38327**

## టూకీగా...



### ముత్తుకూరులో ఇళ్ళ స్థలాల దరఖాస్తుల పరిశీలన

ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయంలో ఈనెల 18న.. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లస్థలాల మంజూరుకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులపై తహశీల్దార్ స్వప్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాలంలో నమోదైన దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనల మేరకు అర్హులను గుర్తిస్తామని చెప్పారు. ముత్తుకూరు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### ఇందుకూరుపేటలో వ్యాసరచన పోటీలు

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 18న ఇందుకూరుపేటలోని గ్రంథాలయంలో, స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు 'గ్రంథాలయాల ప్రాముఖ్యత' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి.

### సంగం వద్ద ఆర్టీసీ బస్సులో మంటలు

సంగం చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సులో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగడంతో ప్రయాణీకులు భయాందోళనలు చెందారు. బస్సు కిందిభాగంలో మంటలు రావడం చూసిన కానిస్టేబుల్ నాగార్జున వెంటనే డ్రైవర్‌ని అప్రమత్తం చేయడంతో బస్‌ని ఆపి, ప్రయాణీకులను దింపి మరో బస్సులో పంపడంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు.

### మర్రిపాడులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

మర్రిపాడులో చలికి వణుకుతున్న సుమారు 50 మంది నిరుపేద వృద్ధులకు సాహో ఫౌండేషన్ అధినేత పి.నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఈనెల 18న దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు రమణయ్య, సర్పంచ్ చిన్నకొండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వృద్ధులకు దుప్పట్లు అందజేశారు.

### కోటితీర్థంలో 'పొలం పిలుస్తోంది'

చేజర్ల మండలం కోటితీర్థం గ్రామంలో ఈనెల 18న మండల వ్యవసాయాధికారిణి హిమబిందు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి నారుమడుల్లో జింక్ లోపం ఉంటే, ఎలా సరిచేసుకోవాలో రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ సహాయ అధికారులు రూప, హసన్ తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలులో వీఆర్‌ఓలతో తహశీల్దార్ సమావేశం

మనుబోలులో ఈనెల 18న తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో మండల వీఆర్‌ఓలు, సర్వేయర్ల సమావేశం జరిగింది. రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించరాదని ఆమె సిబ్బందిని హెచ్చరించారు. విధి నిర్వహణ పట్ల అలక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు. మండల వీఆర్‌ఓ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

### రాపూరులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలను వినియోగించరాదంటూ ఈనెల 18న రాపూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణవేణి ప్రమాణం చేయించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ అధికారి సాయికిరణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### తోటపల్లిగూడూరులో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

తోటపల్లిగూడూరు మండలంలోని విద్యార్థులకు ఈనెల 18 నుంచి 28వతేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరిగొండ, నరుకూరు, పేడూరు తోటపల్లిగూడూరు జడ్పీహైస్కూల్, వరకవిపూడి, చెన్నపల్లిపాళెం, పొట్లపూడి పాఠశాలల్లో ఏర్పాటైన ఈ కేంద్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు.

### కృష్ణపట్నంలో 'గుడి-బడి' కార్యక్రమం

ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో వెలసివున్న కామాక్షీదేవి సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 16న 'గుడి-బడి' కార్యక్రమం నిర్వహించారు. ప్రణవ పీఠం శిష్యబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా, సిద్ధేశ్వర దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.



## భాజపాతో బీహార్...

# కమలనాథులలో హుషార్!

- మోడీ బృందం తిరుగులేని విజయం
- దక్షిణాదిన పాగాయే తదుపరి ఆశయం

సెమీఫైనల్ హిట్. ఫైనల్స్ కోసం పరుగులు. తమిళనాడు, కేరళ, బెంగాల్ వయా బిహార్, బీజేపీ ప్రభంజనానికి బిహార్‌లో బీజం. ఇలా లెక్కకు మిక్కిలి విశ్లేషణలు, వందలాదిగా వ్యాఖ్యానాలు. ఉత్తర భారత దేశంలో ఎన్డీయే పార్టీలు తమ అడ్డా అని చెప్పుకునే బిహార్‌లో కమలం కాంతిపుంజమై వికసించింది. నితీష్ నేతృత్వంలోని జేడీయూ దానికి అగ్నికి వాయువులా తోడైంది. అలాగే, లోక్‌జనశక్తి అధినేత చిరాగ్ పాశ్వాన్ ఉడత సాయం చేయడంతో బీజేపీ కేడర్ రామబాణంలా దూసుకుపోయింది. మహాఘట్ బంధన్‌లోని ఆర్జేడీని, దాని మిత్రపక్షం కాంగ్రెస్‌ను మట్టికరిపించింది. కోలుకోలేని దెబ్బకొట్టి మహా విజయాన్ని కట్టిబెట్టింది. దీంతో 243 నియోజకవర్గా లున్న బిహార్ అసెంబ్లిలో ఏకంగా 202 స్థానాలను కైవసం చేసుకుంది. ఆర్జేడి నేతృత్వంలోని మహా ఘట్ బంధన్‌ను 34 సీట్లకే పరిమితం చేసింది. బీజేపీ త్రిమూర్తులు మోడీ, అమిత్‌షా, నడ్డాతో పాటూ నాలుగో స్తంభంలా ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ కూడా బిహార్‌లోని భారతీయ జనతాపార్టీ కార్యకర్తలకు వెలుగు దీపమై దారి చూపించారు. చివరకు భాజపాని విజయతీరాలకు చేర్చి భవిష్యత్‌లో తమకు ఎదురేలేదని చాటారు. పైగా 89 స్థానాలతో అతిపెద్దపార్టీగా బీజేపీ తన విలువను ఆ రాష్ట్రంలో అమాంతం పెంచుకుంది. ఇదే అదునుగా రానున్న ఎన్నికల్లోనూ తమ సత్తా చాటుతామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### లాలూ-రాహుల్ ఆట సమాప్తం

బిహార్‌లో ఓట్ చోరీ యాత్రతో నెలల తరబడి తిరిగిన రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీచేసి కేవలం ఆరు సీట్లకే పరిమిత మైంది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా డీలా పడిపోయాయి. భవిష్యత్‌లో ఆ పార్టీ నుంచి పిలిచి టికెట్లు ఇచ్చినా పోటీచేసే నాథుడే ఉండడని, బిహార్‌లో హస్తం పార్టీ ప్రాభవం ఇక గత చరిత్రే అని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే పాన్ ఇండియా పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్‌కు బిహార్‌లో 6 సీట్లు రాగా, పాతబస్తీలో ఉపప్రాంతీయ పార్టీ అయిన ఎంఐఎం 5 సీట్లను గెలుచుకోవడం దీనికి నిదర్శనంగా చెప్పు కోవచ్చు. ఇక గతంలో బిహార్‌ను ఏకఛత్రాధిపత్యంగా ఏలిన లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్జేడీ పార్టీ కేవలం 25 సీట్లకే పరిమితమైంది. ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీయాదవ్ చచ్చీచెడి చివరి రెండు రౌండ్లలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. జంగిల్‌రాజ్ (గతంలో బిహార్‌లో అరాచక రాజ్యం) ముద్ర ఆపార్టీని చావుదెబ్బతీసింది. చివరికి ఎన్నికల అనంతరం లాలూ కుటుంబంలోనూ చీలికలకు కారణమైంది. ఇక నితీష్ కుమార్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, నగదు బదిలీ పథకం, భారీగా ఉద్యోగ నోటిఫికేషన్లు వంటివాటితో ఎన్డీయే అద్భుత విజయాన్ని సాధించింది. మరో కీలకాంశం ఏంటంటే, ముస్లిం – యాదవ్ కాంబినేషన్ అంటూ 'మై' పేరుతో ఆర్జేడీ ఎన్నికల బరిలో దిగగా. ప్రధాని మోడీ 'మై' అంటే మహిళలు, యువత అంటూ ప్రజలను ఆకట్టుకున్నారు.

### వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో..

ఇక 2026 బీజేపీకి అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే ఆ పార్టీకి బద్ధ శత్రువులుగా వ్యవహరించే మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్, స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే, కేరళలోని వామపక్ష పార్టీలతో భారతీయ జనతాపార్టీ అమీతుమీ తేల్చుకో నుంది. ఈ నేపథ్యంలో బిహార్ గెలుపు ఈ రాష్ట్రాల్లో బీజేపీకి కొత్త ఉత్తేజాన్నిస్తుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి అంతంత మాత్రమే అయినా, ఈ గెలుపుతో ఎన్డీయే మిత్రపక్షాలు కమలం పార్టీని మరింతగా నమ్మే అవకాశాలే ఎక్కువ. ఎటొచ్చి కాంగ్రెస్ పరిస్థితే అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల కనుసైగల్లో మసలే పార్టీగా కాంగ్రెస్ మారిపోయింది. తాజాగా బిహార్ ఎన్నికల పరాజయంతో రాహుల్‌ను వచ్చే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా ప్రకటించే అవకాశం కూడా మరింత మసకబారుతుందనడంలో సందేహం లేదు. ఇక రాహుల్ ప్రధాన ప్రత్యర్థి అయిన మోడీ చరిష్మా మాత్రం బిహార్ విజయంతో మరో మెట్టు ఎదిగినట్లే లెక్క. బీహార్ గెలుపుతో హుషార్ తెచ్చుకున్న భాజపా, దక్షిణాదిన కూడా పాగా వేసే దిశగా పావులు కదపడం ఖాయంగా కనిపిస్తోంది...!

# అనుబంధం.. అపురూపం!



## ○ కలిసుందాం రా... అంటున్న బాబు, రేవంత్

***వారిని కొందరు గురుశిష్యులంటారు. మరి కొందరు అన్నదమ్ముల్లా భావిస్తారు. ఇంకొందరు గొప్ప సహచరులంటూ కొనియాడతారు. ఇక ప్రత్యర్థుల విషయానికి వస్తే కనిపించని శత్రువులని, వేరువేరు పార్టీల్లో ఉంటూ ఒకే ఎజెండాను అమలు చేసే రహస్య స్నేహితులని కూడా ఆరోపిస్తుంటారు. ఎవరేమన్నా, ఏదేమైనా, వారిద్దరి కలయిక, భేటీ, సమావేశం ఎప్పుడూ ఆసక్తికరమే. ఆ ఇద్దరే ప్రస్తుతం తెలుగురాష్ట్రాలను తమ విజన్‌తో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి.***

ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ చంద్రబాబుకు నమ్మిన బంటుగా, ప్రియ శిష్యుడిగా రేవంత్ వ్యవ్యవహరించిన విషయం అందిరికే తెలిసిందే. కాలక్రమంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విడిపోవడం, తన రాజకీయ ప్రయాణంలో భాగంగా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం చకచకా జరిగిపోయాయి. అయితే, పార్టీని వీడిన సమయంలోనూ, ఆతర్వాత కాలంలోనూ చంద్ర బాబును పల్లెతుమాట అనకుండా రేవంత్ జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో తెలంగాణలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు రేవంత్‌ను తమవారి గానే భావించారు. తగిన సమయంలో మద్దతిచ్చారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ రెండో ముఖ్యమంత్రి కావ డానికి ఈ బంధం కీలక భూమిక పోషించిందంటే అతిశయోక్తి కాదేమో. ఇక పార్టీని వీడినా చంద్రబాబు కూడా రేవంత్ అంటే గతంలో మాదిరే వాత్సల్యం, ప్రేమ చూపించడం కూడా తెలంగాణలో రేవంత్ ఇమేజ్ పెరిగేందుకు దోహదపడింది. ఇదే క్రమంలో తెలంగాణ విడిపోయిన నాటి నుంచి ఓ దశాబ్దం పాటు చక్రం తిప్పిన కేసీఆర్ అటు చంద్రబాబుకు, ఇటు రేవంత్‌రెడ్డికి ఉమ్మడి శత్రువు కావడం కూడా వారిద్దరూ కలిసి సాగేందుకు ఓ కారణంగా కనిపి స్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తుంటారు. చంద్రబాబు ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నా, తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వకుండా తటస్థంగా ఉండడానికి కూడా రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధమే కారణమనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

### ముఖ్యమంత్రులైన తర్వాత కూడా..

గత సార్వత్రిక ఎన్నికల వరకు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకులుగా ఆప్పటి ప్రభుత్వాధినేతలతో చావోరేవో అన్నట్లు పోరాడారు. ఎట్టకేలకు ప్రజల మద్దతుతో ప్రత్యర్థి పార్టీలను చావుదెబ్బ కొట్టి సీఎం పదవులను అధిరోహించారు. ఆ తర్వాత కూడా పార్టీలు వేరైనా భావాలు ఒక్కటే అంటూ కలిసిమెలసి ముందుకు సాగుతున్నారు. అప్పుడప్పుడూ ఆత్మీయంగా పలక రించుకుంటూ ఒకరిపై ఒకరు పరస్పర గౌరవభావం ప్రదర్శిస్తున్నారు. ఇక ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో మరోసారి ఇద్దరు తెలుగురాష్ట్రాల రథసారథులు కలుసుకోవడం, ఆనందంగా పలకరించుకోవడం చూడముచ్చటగా కనిపించింది. పలువురిని ఆకట్టు కుంది. అయితే, వారి ప్రత్యర్థులకు మాత్రం ఈ భేటీ కంటగింపు కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

### విభజన సమస్యలపై చొరవ తీసుకోవచ్చుగా?

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఆత్మీయ భేటీలు వారి అభిమానులను ఆకట్టుకుంటున్నా, తటస్తుల నుంచి మాత్రం కొన్ని ప్రశ్నలు ఎదురువుతున్నాయి. మంచి బాండింగ్ ఉన్న ఇద్దరు అగ్రనేతలు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో కూడా రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి పెద్దగా ముందడుగు పడకపోవడంపై వారు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం రైల్వేజోన్, ఆర్టీసీ ఆస్తుల విభజన, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వివిధ శాఖలకు సంబంధించిన ఫైళ్ల క్లియరెన్స్ తదితర విషయాలపై వారు సూటిగా ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల సీఎంలు మరింత చొరవ చూపించి, కేంద్రంతో సంప్రదింపులు జరిపి పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపి స్తారేమో చూడాలి. ఏదేమైనా రాష్ట్రాలుగా విడి పోయినా, రాజకీయంగా ప్రత్యర్థులైనా, జీవితంలో మాత్రం కలిసుందాం రా... అన్నట్లుగా ఆప్తమిత్రు లుగా ముందుకు సాగడం చంద్రబాబు, రేవంత్ అనుబంధానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు..!

# అండగా ఉంటాం..

## బాలూకి భరోసా ఇచ్చిన మంత్రి ఆనం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో, పీ4 కార్యక్రమంలో భాగంగా తన కుమార్తె, ఆనం లీలా కైవల్య దత్తత తీసుకున్న బంగారు కుటుంబంలో భాగంగా, ఆత్మకూరుకు చెందిన బొమ్మిరెడ్డి మల్లేశ్వరి కుమారుడు బొమ్మిరెడ్డి బాలు యోగక్షేమాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈనెల 19న ఆయన ఆత్మకూరులో జరిగిన 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొని ఆ బంగారు కుటుంబం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడు బొమ్మిరెడ్డి బాలుతో స్వయంగా మాట్లాడి, ఆ బాలునికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు అధికారులు పాల్గొన్నారు.



## వరి నాట్లేసిన 'రైతు బిడ్డ' ప్రశాంతమ్మ

కోవూరు నియోజకవర్గంలోని రేబాల గ్రామంలో 'అన్నదాత సుఖీభవ – పిఎం కిసాన్ యోజన' కార్యక్రమం సందర్భంగా ఈ నెల 19న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వరి పొలాలను సందర్శించారు. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ బురద కయ్యల్లో దిగి రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. తానూ ఓ రైతు బిడ్డనేనని ప్రశాంతమ్మ చాటి చెప్పారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com